విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729
# పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 292 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 15 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# చమురుపైనే గురి

- ఆ దేశంలోని సైనిక, ఇతర లక్ష్యాలపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- దిగిరాకుంటే చమురు కేంద్రాలే లక్ష్యమవుతాయన్న ట్రంప్
- ఇరాక్‌లోని అతి పెద్ద అమెరికా ఎంబసీపై ఇరాన్ దాడి
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపైనా క్షిపణులు, బాంబుల వర్షం
- యూఏఈలో పోర్టు నగరాలపై దాడులు చేస్తామంటూ హెచ్చరిక
- హర్మూజ్‌కు పలు దేశాల యుద్ధ నౌకలు వస్తాయని ట్రంప్ వెల్లడి
- అదే జరిగితే వారి భూభాగాల్లోకి చొరబడతామని ఇరాన్ హెచ్చరిక

దుబాయ్: ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ యుద్ధం చమురు చుట్టూనే తిరుగుతోంది. ఇరాన్ చమురు బలాన్ని అడ్డుకుంటే.. ఆ దేశం దిగివస్తుందనేది అమెరికా వ్యూహంగా ఉంది. అదే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటే ప్రపంచంపై ఒత్తిడి పెరిగి అగ్రరాజ్యం యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఇరాన్ అనుకుంటోంది. శుక్ర, శనివారాల్లో రెండింటి వ్యూహాలు ఈ దిశగానే సాగాయి. ఇరాన్

- మిగతా 2లో





## యుద్ధ నౌకలను పంపండి.. ఇరాన్‌ను క్లోజ్ చేద్దాం

### : ప్రపంచ దేశాల కు ట్రంప్ విజ్ఞప్తి

అమెరికా–ఇజ్రాయెల్– ఇరాన్ యుద్ధం 15 రోజులకు చేరుకుంది. హార్మూజ్ జలసంధిని బ్లాక్ చేసిన ఇరాన్.. శత్రువుల చమురు నౌకలను వెళ్లకుండా కట్టడి చేస్తోంది. ముఖ్యంగా అమెరికాకు వెళ్లే నౌకలపై దాడులకు దిగుతోంది. దీనికి తోడు గల్ఫ్ లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై మిసైళ్లతో విరుచుకుపడుతోంది. ఇటు అమెరికా, ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ ను ఉక్కిరిబిక్కిరి చేసే ప్రయత్నం చేస్తోంది. హార్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో శనివారం (మార్చి 14) ప్రెసిడెంట్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హార్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుందాం.. యుద్ధ నౌకలను పంపండి.. అంటు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు.

- మిగతా 2లో



# కష్టాన్ని మీ గుమ్మం తాకనివ్వం

- ప్రజల కోసం పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వంలో నిధులొచ్చినా పట్టించుకోలేదు
- 'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- గిరిజనుల నడుమ జనసేన ఆవిర్భావ వేడుకలు

'మీరు ఓట్లు వేశారా లేదా అన్నది చూడలేదు. పార్టీ చూడలేదు. మీ అందరినీ మా అన్నదమ్ములు, ఆడపడుచులుగా చూశాం. మీరు బాగుండాలి. సమస్యలతో మీరు ఇబ్బంది పడకూడదు. మీకోసం పని చేయడానికి, మీ కష్టాలు తీర్చడానికే కూటమి ప్రభుత్వం ఉంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం ఓనూరు, నందిగరువు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అడవితల్లి బాట పేరుతో ఓనూరు – నందిగరువు గ్రామానికి వేసిన రోడ్డు, జలజీవన్ మిషన్‌లో భాగంగా వేసిన తాగునీటి కుళాయిలను మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రోడ్డు లేక డోలీమోతలతో నందిగరువు గిరిజనులు పడుతున్న అవస్థలకు విముక్తి కల్పించిన సందర్భంగా వారి మధ్య జనసేన పార్టీ ఆవిర్భావ



దినోత్సవం జరుపుకోవడానికి వచ్చానన్నారు. ఓనూరు కూడలిలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. నందిగరువులో 'మన ఊరు – మాటామంతీ' నిర్వహించి, గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. 'మన్యంలో కేంద్ర సహకారంతో

- మిగతా 2లో

## పోలవరం ప్రాజెక్టుకు మరో రూ.1,500 కోట్లు

### ఎన్డీయే ప్రభుత్వంలో ఇంతవరకు రూ.7,020 కోట్ల అడ్వాన్స్



పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం మూడో విడత నిధులు రూ.1,508 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.5,936 కోట్లు కేటాయించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం అడ్వాన్స్‌గా ఇచ్చిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి వరకు ఖర్చుచేశారు. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను కేంద్రం రూ.3,017.40 కోట్లకు సవరించింది. కేంద్రం ఇంతవరకు ఇచ్చిన అడ్వాన్స్‌లో 80% ఖర్చుచేయడంతో మూడోవిడత అడ్వాన్స్ నిధులు ఇవ్వాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా కేంద్రాన్ని కోరారు.

ప్రస్తుతం రూ.1,508 కోట్లు కేంద్రం అడ్వాన్స్‌గా ఇచ్చింది. ఈ నిధులను మార్చి 15 లోపు ఖర్చు చేస్తే ప్రస్తుత బడ్జెట్‌లోంచి మిగిలిన నిధులన్నీ విడుదల చేస్తామని కేంద్రం షరతు విధించింది. తొలుత సింగిల్ నోడల్ ఖాతాకు కాకుండా స్పర్శ్ విధానంలోనే నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థికశాఖ మెలిక పెట్టింది. రాష్ట్ర ఆర్థికశాఖ, పోలవరం అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాత సింగిల్ నోడల్ ఏజెన్సీ తరహాలోనే కేంద్రం నిధులిచ్చింది. అందులో రాష్ట్ర ఆర్థికశాఖ ఇప్పటికే రూ.500 కోట్ల వరకు పోలవరం ఖాతాకు నిధులు ఇచ్చింది.

పోలవరం పనుల కోసం రూ.500 కోట్లు, పునరావాసం కోసం రూ.500 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. గతంలో తాము ప్రతిపాదించిన కొన్ని పనుల బిల్లులకు కోత పెట్టారని, ఆ బిల్లులను ఆమోదించాలని పోలవరం

- మిగతా 2లో



## కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది

### అస్సాం, పశ్చిమ బెంగాల్ పర్యటనల్లో మోదీ విసుర్లు

సిల్చర్/కోల్‌కతా: ప్రపంచ యుద్ధాల ప్రభావం ప్రజలపై అతి తక్కువగా పడేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తూ భయాందోళనల సృష్టికి ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శనివారం ప్రధాని పర్యటించారు. పశ్చిమ బెంగాల్‌లో రూ.18,680 కోట్ల

- మిగతా 2లో



## ధరల మంట.. మెనూలో కోత

### హోటళ్లు, రెస్టారెంట్లకు యుద్ధం సెగ

లఖ్‌నవూ: పశ్చిమాసియాలో యుద్ధం సెగ భారత్‌లోని పలు హోటళు ౣ, రెస్టారెంట్లను తాకింది. దేశంలో ఇప్పటికే ఏర్పడ్డ ఎల్పీజీ కొరతను అధిగమించేందుకు ఎక్కువ శాతం హోటళ్లు, రెస్టారెంట్లు తమ మెనూలో పదార్థాలను తగ్గించి, ధరలను అమాంతం పెంచేశాయి. కొందరు నిర్వాహకులు గ్యాస్ బదులు కట్టెలు, బొగ్గుల

- మిగతా 2లో

## గుత్తేదార్ల కోసమే 'ఉపాధి'లో మార్పు

దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి వెచ్చించే రూ.80 వేల కోట్లను గుత్తేదార్లకు దోచిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అందుకోసమే ఉపాధి పథకాన్ని మార్పు చేసి, పేదలకు నష్టం కలిగిస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకించకుండా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి

- మిగతా 2లో



## ఎండల తీవ్రతపై 'అవేర్'

ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వేసవి కార్యాచరణ ప్రణాళిక– 2026పై కీలక శాఖలను సన్నద్ధం చేసింది. వేసవిలో సమర్థ సేవలు అందించేందుకు 'అవేర్' వ్యవస్థ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. వాతావరణ శాఖ ద్వారా అందే సమాచారం ఆధారంగా ఎండ తీవ్రతపై నాలుగైదు రోజుల ముందే సమాచారమిచ్చి ఆయా ప్రాంతాల ప్రజలను కలెక్టర్లు, వైద్యులు, సిబ్బంది ద్వారా అప్రమత్తం చేయనుంది.

- మిగతా 2లో



## భట్టి కుమారుడు, కోడలికి చంద్రబాబు ఆశీస్సులు



తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు, కోడలిని ఏపీ సీఎం చంద్రబాబు ఆశీర్వదించారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు విచ్చేసిన ఆయనకు కొత్త జంట సూర్య విక్రమాదిత్య, సాక్షిలు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ నెల 5న బిజీ షెడ్యూల్ కారణంగా వారి వివాహానికి తాను హాజరు కాలేకపోయినట్లు చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

**శిరీష్, నయనిక దంపతులకు సీఎం శుభాకాంక్షలు**

నూతన దంపతులు అల్లు శిరీష్, నయనికలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ జంట వివాహం ఈ నెల 6న జరగగా ప్రభుత్వ కార్యక్రమాలు ఉండటంతో సీఎం హాజరు కాలేకపోయారు.

- మిగతా 2లో

# చమురుపైనే గురి

-మొదటిపేజీ తరువాయి

చమురుకు ఆయువుపట్టయిన ఖర్గ్ ద్వీపంలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేసింది. ఇరాన్ ఓటమిని అంగీకరించకుంటే అక్కడి చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇటు హర్మూజ్ జల సంధిలో చమురు రవాణాకు ఇరాన్ మరిన్ని అడ్డంకులు సృష్టిస్తోంది. దీనిని అడ్డుకోవడానికి పలు దేశాలు యుద్ధ నౌకలను పఘుపనున్నాయని ట్రంప్ తెలిపారు. అదే జరిగితే ఆయా దేశాల్లోకి చొరబడతామని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు అమెరికా దాడులు చేయడానికి ఉపయోగించుకుంటున్న యూఏఈ నగరాలపై దాడులు చేస్తామని పేర్కొంది. ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని సూచించింది. ఇరాన్‌లోని ఖర్గ్, అబు మూసా ద్వీపాలపై అమెరికా బలగాలు శుక్రవారం విరుచుకుపడ్డాయి. అక్కడి సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయి. వైమానిక, నౌకా స్థావరాలు, విమానాశ్రయ కంట్రోల్ టవర్, చమురు సంస్థ హెలిప్యాడ్‌లపై దాడులు జరిగాయి. ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఈ ద్వీపంలో సైనిక స్థావరాలను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు. హర్మూజ్‌లో నౌకలను అడ్డుకుంటే చమురు క్షేత్రాలపైనా దాడులు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా దాడులవల్ల ఖర్గ్‌లోని చమురు క్షేత్రాలకు ఎటువంటి నష్టం జరగలేదని ఇరాన్‌కు చెందిన ఫార్స్ వార్తా సంస్థ వెల్లడించింది. దాడులవల్ల 15 పేలుళ్లు చోటుచేసుకున్నాయని తెలిపింది.

ఇప్పటిదాకా ఇరాన్‌లోని 15,000 లక్ష్యాలపై దాడులు చేశామని, రోజుకు 1,000కిపైగా లక్ష్యాలపై బాంబులు వేశామని అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు.

అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో 52 సాంస్కృతిక కేంద్రాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ వెల్లడించింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. ఇప్పటిదాకా ఆ దేశంపై జరిగిన దాడుల్లో 800 మందికిపైగా మృతి చెందారు. 8,50,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ దాడుల్లో మొత్తం 26 మంది వైద్య సిబ్బంది మరణించారు. మరో 51 మంది గాయపడ్డారు.

శుక్రవారం రాత్రి లెబనాన్‌లోని బుర్జ్ ఖలాయియాలోని ఆరోగ్య కేంద్రంపై వైమానిక దాడి జరిగింది. ఈ ఘటనలో 12 మంది మరణించారు.

మన చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటే గల్ఫ్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ సంయుక్త మిలిటరీ కమాండ్ హెచ్చరించింది. ఆ దేశాల చమురు, ఆర్థిక, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. యూఏఈలోని పోర్టులు, డాక్‌యార్డులు, రహస్య కేంద్రాల నుంచి ఖర్గ్ ద్వీపంపై అమెరికా దాడులు చేసిందని, తాము యూఏఈలోని నగరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని హెచ్చరించింది.

ఇరాన్‌లోని మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని 24 గంటల్లో ఇజ్రాయెల్ 200 దాడులు చేసింది. ఇందులో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, రక్షణ వ్యవస్థలు, ఆయుధ ఉత్పత్తి కేంద్రాలున్నాయి.

**అమెరికా ఎంబసీపై..**

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై శనివారం ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులను కొనసాగించింది. హర్మూజ్ జల సంధిని మరింతగా మూసివేసింది.

ఇరాక్‌లోని బాగ్దాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి జరిగింది. హెలిప్యాడ్ ధ్వంసమైంది. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద అమెరికా ఎంబసీల్లో ఒకటి. దీనిపై ఇరాన్ అనుకూల మిలిటెంట్లు పదే పదే దాడులు చేస్తున్నారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయగా రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. అయితే ఆ శకలాలు చమురు కేంద్రాన్ని తాకాయి. ఫజైరా పోర్టుపై జరిగిన దాడితో మంటలు చెలరేగాయి. డ్రోన్‌ను అడ్డుకున్నా శకలాలు పడి మంటలు వచ్చాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యూఏఈపై 9 బాలిస్టిక్ క్షిపణులను, 33 డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. వీటితో కలిపితే యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా యూఏఈవైపు 294 బాలిస్టిక్, 15 క్రూజ్ క్షిపణులు, 1,600 డ్రోన్లు దూసుకొచ్చాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించగా 141 మంది గాయపడ్డారు. దుబాయ్‌లో ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రమైన ఓ భవనంపై దాడి జరిగింది. 24 గంటల్లో ఈ ప్రాంతంలో రెండోసారి దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది.

యూఏఈలోని జెబెల్ అలీ, ఖలీఫా, ఫజైరా పోర్టులను ఖాళీ చేయాలని ఇరాన్ హెచ్చరించింది. వాటిపై దాడులు చేస్తామని పేర్కొంది.

బహ్రెయిన్‌పై 10 డ్రోన్లను, 3 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇప్పటిదాకా బహ్రెయిన్‌పైకి 124 క్షిపణులు, 203 డ్రోన్లు దూసుకొచ్చాయి.

ఇజ్రాయెల్‌కు డ్రోన్లను సరఫరా చేయడంద్వారా ఉక్రెయిన్ యుద్ధంలోకి దిగిందని భావిస్తున్నామని జాతీయ భద్రతపై ఇరాన్ పార్లమెంటరీ కమిటీ అధిపతి ఇబ్రహీం అజీజి స్పష్టం చేశారు. ఆ దేశం మొత్తం తమ క్షిపణులు, డ్రోన్ల పరిధిలో ఉందని హెచ్చరించారు.

ఇరాన్ దాడుల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంలో అమెరికా వాయుసేనకు చెందిన 5 విమానాలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు చెప్పినట్లుగా అంతర్జాతీయ వార్తా సంస్థ వాల్‌స్ట్రీట్ జనరల్ తెలిపింది.

**అమెరికా దాడి చేసిన ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్**

**36,469 నివాసాలు ధ్వంసం**

అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా తమ దేశంలోని 36,469 నివాసాలు, 6,179 వాణిజ్య సముదాయాలు దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫతేమీ మొహజెరానీ తెలిపారు. యుద్ధం కారణంగా 223 మంది మహిళలు, పిల్లలు చనిపోయారని, 2,129 మంది గాయపడ్డారని వివరించారు. అయితే మొత్తం మృతులు, గాయపడ్డవారి సంఖ్యను ఆమె వెల్లడించలేదు. సైనికపరంగా జరిగిన నష్టాన్నీ తెలియజేయలేదు.

**2,500 మెరీన్ల రాక**

యుద్ధం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాకు 2,500 మంది మెరీన్లను, ఉభయచర యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలిని అమెరికా పంపింది. ఇప్పటికే అరేబియా సముద్రంలో 12 యుద్ధ నౌకలు, విమానవాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్, 8 డిస్ట్రాయర్లు ఉన్నాయి. ఇప్పుడు ట్రిపోలి వస్తే అమెరికా సైన్యానికి మరింత బలం చేకూరుతుంది.

**మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఫ్రాన్స్**

లెబనాన్ అధ్యక్షుడు, ప్రధాని, పార్లమెంటు స్పీకర్లతో తాను మాట్లాడానని, ఇజ్రాయెల్‌తో చర్చల కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. లెబనాన్ యుద్ధంలో మరింతగా కూరుకుపోకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అనుచిత దాడులను హెజ్‌బొల్లా ఆపాలని, వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపేయాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్‌తో నేరుగా చర్చించడానికి లెబనాన్ నేతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

యుద్ధం ప్రారంభమయ్యాక 2 వారాలపాటు ఇరాన్ అంతటా అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. కానీ ఖర్గ్ ద్వీపాన్ని ముట్టుకోలేదు. యుద్ధం 3వ వారంలోకి ప్రవేశించిన వెంటనే అనూహ్యంగా ఖర్గ్‌పై అమెరికా దాడులు చేసింది. దీంతో కొంత ఆందోళన వ్యక్తమైంది. అయితే అక్కడి చమురు క్షేత్రాలను తాకలేదు. ఇరాన్‌కు ఆర్థికంగా వెన్నెముకగా ఖర్గ్ ఉంది. ఆ దేశం ఎగుమతి చేసే చమురులో 90శాతం ఇక్కడి నుంచే వెళ్తోంది. ప్రపంచానికి అవసరమైన చమురులో 4.5శాతం ఇరాన్ ఎగుమతి చేస్తోంది. ఇంత ఉద్రిక్తతల్లోనూ ఖర్గ్‌లో రెండు నౌకల్లో చమురును నింపుతున్నారు.

**హర్మూజ్‌కు పలు దేశాల యుద్ధ నౌకలు!**

హర్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ ఇబ్బంది పడుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి త్వరలో ఈ దేశాలు తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని వెల్లడించారు. యుద్ధ నౌకలను పంపాలని ఆయన బ్రిటన్ తదితర దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఈ జల సంధివద్ద బాంబు దాడులతో ఇప్పటికే ఇరాన్‌ను అడ్డుకుంటున్నామని తెలిపారు. ఈ వార్తలను ఇరాన్ విదేశాంగశాఖ మాజీ మంత్రి మనూఛెర్ మొతాకిల్ ఖండించారు. తమ భూభాగంలోకి చొరబాట్లు జరిగితే వారి భూభాగాల్లోకి వెళ్లి దాడులు చేస్తామని హెచ్చరించారు.

**ఇంకో ఐదేళ్లయినా యుద్ధానికి రెడీ: ఇరాన్**

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ తేల్చి చెప్పారు. ఇరాన్ చర్చలను కోరుకుంటోందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవసరమైతే ఇంకో ఐదేళ్లు యుద్ధాన్ని కొనసాగించే సత్తా తమకు ఉందని స్పష్టం చేశారు. గతంలో ఎనిమిదేళ్ల పాటు ఇరాన్, ఇరాక్ యుద్ధం జరిగిందని, దీర్ఘకాలిక యుద్ధాలు చేసిన అనుభవం తమకు ఉందని తెలిపారు.

తమ దాడుల్లో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని అమెరికా పేర్కొంది. గుర్తుపట్టలేని విధంగా మొజ్తాబా మారినట్లు భావిస్తున్నామని తెలిపింది. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతం చేయడంపైనే అధ్యక్షుడు ట్రంప్ దృష్టి పెట్టారని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పెంటగాన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

# కష్టాన్ని మీ గుమ్మం తాకనివ్వం

-మొదటిపేజీ తరువాయి

రోడ్లు వేయగలుగుతున్నాం. గత ప్రభుత్వంలోనూ ఈ నిధులున్నాయి. వాటిని ఏం చేశారని మీరే వారిని నిలదీయాలి. కూటమి ప్రభుత్వం ఈ నిధులను మళ్లించకుండా పీవీటీజీ, గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తోంది. కూటమి హయాంలో మన్యంలో 460 కి.మీ.పైగా రోడ్లు వేశాం. జలజీవన్ మిషన్‌కు కేంద్రం గత ప్రభుత్వంలో నిధులు కేటాయిస్తే వైకాపా ప్రభుత్వం తీసుకోలేదు. కేవలం పైపులైన్లు వేసి వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఆ నిధులతో ఇంటింటికీ తాగునీరు అందిస్తోంది' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

**అండగా ఉంటే నిలబడి సమస్యలు తీరుస్తాం**

జనసేన పార్టీ పెట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. 'పార్టీ పెట్టిన తర్వాత ఎంత దూరం ప్రయాణిస్తాం, ఏం అవుతామని ఆలోచించలేదు. గిరిజన ప్రాంతాల్లో సదుపాయాలు కల్పిస్తున్నందుకు ఈరోజు చాలా తృప్తిగా, సంతోషంగా ఉంది. మీరంతా మద్దతుగా ఉంటే గిరిజన ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేస్తాం. మీకు అండగా ఉంటాం. వచ్చే ఎన్నికల్లో కూటమిని దిగ్విజయంగా గెలిపించండి. సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమీక్షించి పరిష్కారమయ్యేలా చేస్తాం' అని పవన్ అన్నారు.

నందిగరువు గ్రామానికి 3 కి.మీ.ముందు గిరిజనులు థింసా నృత్యాలతో పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఓనూరు మీదుగా నందిగరువు వరకు సుమారు 3 కి.మీ. నడుచుకుంటూ వెళ్లారు. మార్గమధ్యలో మహిళల నుంచి వినతులు స్వీకరించారు. తీయగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఓనూరులో గిరిజన మహిళలతో కలిసి జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించారు. ప్రకృతి అందాలను వీక్షించి, పర్యాటక వ్యూ పాయింట్లుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంట.. మెనూలో కోత

-మొదటిపేజీ తరువాయి

పొయ్యిని వాడుతుండటంతో వాటి ధరలు సైతం అధికమయ్యాయి. దిల్లీలోని ప్రముఖ రెస్టారెంట్లలో కార్పొరేట్ మీటింగ్‌లు, గ్రూప్ సమావేశాల ప్రాధాన్యత తగ్గింది. వంట, వాణిజ్య గ్యాస్ కొరత భయాలను తగ్గించేందుకు పలు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. బ్లాక్ మార్కెట్ను అరికట్టేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ఆహార, పౌర సరఫరాల శాఖ దాదాపు 14 వందలకు పైగా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి ఆరుగురిని అరెస్టుచేసింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా, దక్షిణ 24 పరగణాల, ఉత్తర 24 పరగణాల సహా పలు జిల్లాల్లో ఎల్పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ పంపిణీ కేంద్రాల వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే ప్రజలు భారీగా క్యూ కట్టారు. పలు చోట్ల ప్రజలకు పిడకలను ఉచితంగా పంపిణీ చేశారు. వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తున్న 316 వంట గ్యాస్ సిలిండర్లను కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ స్వాధీనం చేసుకుంది. ఎలక్ట్రికల్ స్టౌవ్‌లకు మారే రెస్టారెంట్లు, హోటళ్లు, టీ దుకాణాలకు విద్యుత్ యూనిట్‌కు రూ.2 చొప్పున రాయితీ ఇవ్వనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. రాజస్థాన్‌లోని పలు దాబాలు, హోటళ్లు బొగ్గుతో వండే సంప్రదాయ భట్టీలకు మారుతున్నాయి. దీంతో అక్కడ బొగ్గుకు భారీగా డిమాండ్ పెరిగింది.

**ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు: కేంద్రం**

ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవని, బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుందని కేంద్ర ప్రభుత్వం మరోసారి పునరుద్ఘాటించింది. సిలిండర్ల విషయంలో చాలామంది ఆందోళన చెందుతున్నారని, చాలామంది అవసరం లేకున్నా బుకింగ్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేసింది. వాణిజ్య సిలిండర్ల విషయంలో రాష్ట్రాలతో మాట్లాడుతున్నామని, ప్రాధాన్య క్రమంలో సరఫరా చేస్తున్నామని స్పష్టంచేసింది. భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ శనివారం పలు వివరాలు వెల్లడించారు. "హర్మూజ్ వద్ద 24 నౌకలు ఉన్నాయి. ఎల్‌పీజీ సరఫరా చేసే 2 నౌకలు హర్మూజ్ నుంచి బయలుదేరాయి. శివాలిక్, నందాదేవి నౌకల్లో ఎల్‌పీజీ తరలింపు జరుగుతోంది. రెండు నౌకలు ఈనెల 16, 17 తేదీల్లో ముంద్రా, కాండ్లా పోర్టులకు వస్తున్నాయి. పోర్టుల్లో సమస్యలు రాకుండా చూడాలని, సిలిండర్ల బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలను కోరాం. సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. సిలిండర్ల బుకింగ్ వ్యవధి పట్టణాల్లో 25, గ్రామాల్లో 45 రోజులుగా ఉంది. సిలిండర్ల బుకింగ్ ఫోన్, ఐవీఆర్ఎస్, ఇతర విధానాల్లో చేయవచ్చు. డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లి క్యూలో ఉండనక్కర్లేదు. బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది" అని సుజాత శర్మ వెల్లడించారు.

## గుత్తేదార్ల కోసమే 'ఉపాధి'లో మార్పు

-మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్, వైకాపా అధ్యక్షుడు జగన్ భాజపాకు బానిసలుగా మారిపోయారని ఆరోపించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా శనివారం ఆమె అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం చేరుకున్నారు. అక్కడ కూలీలతో కలిసి ఉపాధి పనిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం తదితరులు పాల్గొన్నారు.

## ఎండల తీవ్రతపై 'అవేర్'

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు వేసవి కార్యాచరణ ప్రణాళిక, సన్నద్ధతపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీచేశారు.

## భట్టి కుమారుడు, కోడలికి చంద్రబాబు ఆశీస్సులు

-మొదటిపేజీ తరువాయి

ఆయన శనివారం హైదరాబాద్‌లోని నిర్మాత అల్లు అరవింద్ నివాసానికి వెళ్లి, నూతన దంపతులు శిరీష్, నయనికలను ఆశీర్వదించారు. అనంతరం కొద్దిసేపు అల్లు కుటుంబంతో సరదాగా ముచ్చటించారు. విదేశాల్లో ఉన్న నటుడు అల్లు అర్జున్‌తో ఫోన్లో మాట్లాడారు.

## యుద్ధ నౌకలను పంపండి.. ఇరాన్‌ను క్లోజ్ చేద్దాం

-మొదటిపేజీ తరువాయి

జలసంధి వెంట ట్యాంకర్లకు భద్రతగా అమెరికా నేవీ వెళ్లనుంది. ఇరాన్ జలసంధిని మూసి వేయడంతో ప్రభావితమైన దేశాలు.. యుద్ధ నౌకలను పంపాలి. అమెరికాతో పాటు జలసంధిని దక్కించుకోవడానికి రావాలి.. అంటూ పిలుపునిచ్చారు ట్రంప్.

ఇరాన్ మిలిటరీ శక్తులను 100 శాతం నాశనం చేశాం. కానీ.. డ్రోన్స్, మిస్సైల్ తో .. మైన్స్ తో మేనేజ్ చేయాలని చూస్తోంది. ఇరాన్ దారుణంగా ఓడి పోయింది. చైనా, ఫ్రాన్స్, జపాన్, సౌత్ కొరియా, యూకే మొదలైన దేశాలు నౌకలను పంపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు ట్రంప్. ఈ దేశాలు నౌకలను పంపిస్తే.. హార్మూజ్ జలసంధి దగ్గర ఇక ఎలాంటి అడ్డంకులు ఉండవని అన్నారు.

## కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

విలువైన రవాణా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను.. అస్సాంలో రెండు రోజుల్లో కలిపి మొత్తం రూ.47,800 కోట్ల ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ అస్సాంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌ను, పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. అస్సాంలోని సిల్చర్‌లో ప్రాజెక్టుల ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. "దేశానికి సంబంధించి, అస్సాం గురించి కాంగ్రెస్‌కు ఎలాంటి దార్శనికత లేదు. మోదీని ఎలా తిట్టాలి, పుకార్లు.. అబద్ధాలు ఎలా వ్యాప్తి చేయాలి, ప్రజల్ని తప్పుదోవ పట్టించే రీళ్లు ఎలా చేయాలో మాత్రమే వారికి తెలుసు" అని దుయ్యబట్టారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ నిర్వాకాన్ని దేశమంతా విమర్శించినా, 'రాజ కుటుంబం' మాత్రం ఆందోళనకారుల వెన్ను తట్టిందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదేళ్లపాటు అస్సాంకు ప్రాతినిధ్యం వహించినా రాష్ట్ర రైతులకు ఒక్కపైసా ఇవ్వలేదని, భాజపా రూ.20 వేల కోట్ల కంటే ఎక్కువ మొత్తాన్ని అందించిందన్నారు.

బెంగాల్ ఆటవిక పాలకులకు కౌంట్‌డౌన్

రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును అవమానించడం ద్వారా పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ హద్దులన్నిటినీ మీరిపోయిందని ప్రధానమంత్రి మండిపడ్డారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మెగా ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ... రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు ముఖ్యమంత్రి గానీ, కనీసం రాష్ట్ర మంత్రి గానీ వెళ్లకుండా టీఎంసీ దేశంలోని గిరిజనులను, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించిందని అన్నారు. రాష్ట్రంలోని తృణమూల్ పాలనలో అట్టడుగు వర్గాలు వేధింపులకు గురవుతున్నాయని తెలిపారు. చొరబాటుదారుల ఓటుబ్యాంకును కాపాడుకునేందుకే ఓటరు జాబితాల సవరణకు తెచ్చిన 'సర్' ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌కు ఆటవిక పాలన తెచ్చినవారికి కౌంట్‌డౌన్ మొదలైందని, దురాగతాలకు పాల్పడిన టీఎంసీ నాయకులను వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు.

ప్రధాని కోల్‌కతా ర్యాలీకి అరగంట ముందు మధ్య కోల్‌కతా ప్రాంతంలో భాజపా, టీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలూ రాళ్లు రువ్వుకోవడంతో పోలీసు అధికారితోపాటు ఒక భాజపా నాయకుడు గాయపడ్డారు. ప్రధాని ర్యాలీకి పార్టీ మద్దతుదారులను చేరవేస్తున్న తమ వాహనాలు టీఎంసీ దాడిలో ధ్వంసమయ్యాయని భాజపా తెలిపింది. ఈ ఆరోపణను ఖండించిన టీఎంసీ.. భాజపా గూండాలు మంత్రి శశి పాంజా ఇంటిపై రాళ్లు రువ్వి ఉద్రిక్త పరిస్థితి సృష్టించారని ఆరోపించింది.

## పోలవరం ప్రాజెక్టుకు మరో రూ.1,500 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

అధికారులు కేంద్రాన్ని కోరారు.

**3 విడతల అడ్వాన్స్ కలిపి రూ.7,020 కోట్లు**

పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంతవరకు రూ.7,020 కోట్లు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండు విడతలుగా అడ్వాన్స్ నిధులు రూ.5,512.40 కోట్లు అందాయి. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,508 కోట్లు అడ్వాన్స్‌గా వచ్చాయి.

**కొత్త బడ్జెట్‌లో రూ.3,320 కోట్లు**

ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే తదుపరి ఆర్థిక సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.3,320 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చూపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో చూపిన రూ.1,500 కోట్లు వినియోగించుకోలేకపోతే ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఇంకా రూ.1,800 కోట్ల వరకు తొలి దశకు నిధులివ్వాలి.

# జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పంచకర్ల







**పరవాడ, పెన్ సత్తా, మార్చి 14:** మండలం కేంద్రం లోని జనసేన నాయకుల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిథిగా పార్టీ జెండా ఎగరవేసి వేడుకలు నిర్వహించడం జరిగింది. పరవాడ మండలంలో ఉన్న 60 అంగన్వాడీ కేంద్రాలకు కేంద్రానికి ఐదు కుర్చీలు చొప్పున మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొద్ధపు శ్రీనివాస రావు, బుగిడి రామ గోవిందరావు, వెన్నెల నరసింహా రావు ల ఆర్థిక సహాయంతో 300 కుర్చీలు అందజేయడం జరిగింది.

కలపాకి పంచాయతీకి చెందిన తల్లి దండ్రులు లేని ఇద్దరు పిల్లలకు కలపాక జనసేన నాయకులు అక్కిరెడ్డి శ్రీనివాసరావు, బొండా పవన్ కళ్యాణ్ ఇద్దరు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 5 వేల రూపాయల చెక్కు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరవాడ మండల జనసేన సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, బొద్దపు వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కరణం నర్సింగరావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, మండల ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, వర్రీ పరదేశి నాయుడు, మడక రమణ, వెలుగుల అనిల్, పిల్లా శివకృష్ణ, పెద్దిశెట్టి సత్యారావు, పెదిశెట్టి రామారావు, అర్జిల్లి అప్పలరాజు, మేడశెట్టి వెంకటరావు, ఇందల అశోక్, పైలా దినేష్, ఇరోతి రమేష్, కోమటి కరుణ్ కుమార్, బొండా పవన్ కళ్యాణ్, మోటూరు హరి, బొద్దపు అయ్యబాబు, సుందరపు శ్రీను, బొండా అచ్చిబాబు, సాలాపు శివ, వీర మహిళలు పావని నాయుడు, సత్తివాడ జ్యోతి, దాసరి జయలక్ష్మి, మడక పార్వతి, అధిక సంఖ్యలో జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్







- బీజేపీ ప్రశిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్.
- బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీ వెన్నెముక మంత్రి సత్య కుమార్ యాదవ్
- ప్రజల సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలి.
- గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం కావాలి.
- కార్యకర్తలకు మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచన.
- సేవ, జాతీయత, అభివృద్ధి బీజేపీ ధ్యేయం.

**ముదిగుబ్బ, పెన్ సత్తా, మార్చి 14:** ముదిగుబ్బ మండలం లోని ఆర్ఎస్‌పి కళ్యాణ మండపంలో శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, వివిధ మోర్చాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు సిద్ధాంత పరంగా బలంగా ఉండడం పార్టీ ఎదుగుదలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుబంధం పెంచుకొని గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్య పనిచేసే కేడర్ ఉన్నప్పుడు మాత్రమే పార్టీ ప్రజల విశ్వాసాన్ని పొందుతుందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఒక సాధారణ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశ అభివృద్ధి, జాతీయత, సేవా భావంతో ముందుకు సాగుతున్న జాతీయ ఉద్యమమని తెలిపారు. పార్టీ కార్యకర్తలు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం(ఇంటెగ్రల్ హ్యూమానిజం) సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని మంత్రి సూచించారు. సమాజం లోని ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు చేరేలా పనిచేయడం బీజేపీ లక్ష్యమని వివరించారు. ఈ ప్రశిక్షణ కార్యక్రమాలు కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి బాధ్యతలు, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసే విధానాల పై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లోని ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పలు కీలక పథకాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, జల్ జీవన్ మిషన్, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాల ద్వారా కోట్లాది ప్రజలు లబ్ధి పొందుతున్నారని వివరించారు. ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని మంత్రి సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడేలా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి బాధ్యులు, యువ మోర్చా, మహిళా మోర్చా నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ మోర్చాలకు చెందిన నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ హాస్పిటల్ ని సందర్శించిన కొణతాల

## సీఎస్సార్ నిధులతో ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ నందు అభివృద్ధి పనులు

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ నందు నూతనంగా ఆర్సెచ్ఐ మేగ్నేసిత ఇండియా లిమిటెడ్ వారి సహకారంతో సీఎస్సార్ నిధులు సుమారు 1 కోటి 40 లక్షల రూపాయలతో డి అడిక్షన్ సెంటర్, మదర్ ఫీడింగ్ అండ్ వెయిటింగ్ హాల్, మోడరన్ మార్చురీ రూమ్ మూడు భవనాల నిర్మాణం చేపట్టారు.

మంజూరైన నిర్మాణ పనులను మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ నూతనంగా నిర్మించే భవనాలు యొక్క సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం హాస్పిటల్ యొక్క అత్యవసర విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు కోసం వైద్యులను, రోగులను వివరాలు అడిగి తెలుసుకుని పరిశుభ్ర మైన వాతావరణంతో కూడిన, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన చేశారు. ఎన్టీఆర్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ ని సందర్శించి అక్కడ వాతావరణం పరిశీలించి ప్రజల నుండి భోజనం క్వాలిటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, భోజనం క్వాలిటీగా ప్రజలకు అందించాలని, క్వాలిటీ విషయంలో రాజీ పడేది లేదని కాంట్రాక్టర్లకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, డాక్టర్ డి డి నాయుడు, తాడి శాంతి కుమారి పాల్గొన్నారు .










# ఆర్యవైశ్యులు తలచుకుంటే ఏదైనా సాధ్యమే.

- వాడపల్లి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్న ఎమ్మెల్యే బండారు







**వాడపల్లి, పెన్ సత్తా, మార్చి 14:**రూ.25 కోట్లతో ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో వాడపల్లిలో ఆర్య వైశ్య కళ్యాణ మండపం, అన్నదానం హాల్, గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ఆర్యవైశ్యులు తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. కన్యాకుమారి నుంచి కాశీ వరకూ ఎక్కడ పుణ్యక్షేత్రాలున్నా అక్కడ ఆర్యవైశ్యులు తమ సేవా కార్యక్రమాలతో ముందుంటారన్నారు. కోనసీమ తిరుమల వాడపల్లిలో ఆర్యవైశ్య నిత్య అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో కళ్యాణ మండపం, 700 మంది కెపాసిటీతో డార్మెటరీ, అన్నదానం హాల్, 90 గదుల నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, అనపర్తి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఆకుల రామకృష్ణ, భాజపా నాయకులు తమలంపూడి రామకృష్ణా రెడ్డి, పాలూరి సత్యానందం తదితరులతో కల్సి శంకుస్థాపన చేశారు. తిరుమల తరహాలో వాడపల్లి పుణ్యక్షేత్రం దినదినప్రవర్ధమానమై విలసిల్లుతుందని, మరో తిరుమలగా భాసిల్లుతూ అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. నేడు ఇక్కడ ఆర్యవైశ్య ప్రముఖులు అంతా ఏకమై మంచి కార్యక్రమానికి అంకురార్పణ చేశారని ప్రశంసించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం, డార్మిటరీలు, గదులు నిర్మాణంతో మరిన్ని సౌకర్యాలు ఏర్పడి వాడపల్లి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దానికి సంకేతమే ఈ శంకుస్థాపన కార్యక్రమమని అభివర్ణించారు. ఇంత గొప్ప కార్యక్రమంలో భాగస్వామి కావడంతో తన జన్మ ధన్యమైందని వ్యాఖ్యానించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం, డార్మిటరీ, గదులు కట్టాలని శ్రీఘాకోళ్లపు శవరామసుబ్రహ్మణ్యం తదితర ఆర్యవైశ్య ప్రముఖులను కోరడం జరిగిందన్నారు. త్వరలో ప్రభుత్వం తరపున సైతం డార్మిటరీ, గదుల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందన్నారు. ముందుగా ఆర్యవైశ్యుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం శుభసూచకమన్నారు. త్వరితగతిన పనులు జరిగి వచ్చే పుష్కరాల కల్లా ఆర్యవైశ్య కల్యాణ మండపం, గదులు నిర్మాణం పూర్తికావాలని ఆకాంక్షించారు. వాడపల్లి అభివృద్ధికి ప్రభుత్వం తరపున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రసాద్ స్కీంలో వాడపల్లి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు.

# పండుగలా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 14:**జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా 13 వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం భారీగా బైక్ ర్యాలీ నిర్వహణ.

సీతంపేట కార్యాలయం నుంచి జగదాంబ వరకు స్వయంగా బైక్ నడిపిన ఎమ్మెల్యే వంశీకృష్ణ. జనసేన పార్టీ స్థాపన ప్రజల కోసం, సమాజంలో మార్పు కోసం అని తెలిపిన ఎమ్మెల్యే వంశీ. జగదాంబ జంక్షన్ వద్ద జనసేన పార్టీ జెండా ఆవిష్కరించిన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ. ఆవిర్భావ దినోత్సవ వేడుకకు భారీగా హాజరైన జన సైనికులు, వీర మహిళలు. శనివారం విశాఖ నగర జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు తో పాటు జిల్లా, వార్డు శ్రేణులు భారీగా చేరుకుని సంబరాలు జరుపుకున్నారు. సీతంపేట నగర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం జనసేన పార్టీ నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సీతంపేట కార్యాలయం నుంచి వరకు పార్టీ శ్రేణులతో కలసి స్వయంగా బైక్ నడిపి పార్టీ శ్రేణులలో ఉత్సాహం నింపారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కలిసి పని చేద్దామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస తెలిపారు. అనంతరం జనసేన పార్టీ జగదాంబ జంక్షన్ లో భారీ కేక్ కటింగ్ , జెండా ఆవిష్కరణ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, నియోజకవర్గం ఇంచార్జ్‌లు, ఉత్తరాంధ్ర మహిళా కో ఆర్డినేటర్ లు, జిల్లా సీనియర్ నాయకులు, జీవీఎంసీ కార్పొరేటర్లు, నామినేటెడ్ చైర్మన్ లు, డైరెక్టర్లు, మాజీ కార్పొరేటర్ లు, జనసేన పార్టీ వార్డ్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.


## ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో అంబరాన్నంటిన
# పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- పిఠాపురం గడ్డ పవన్ కళ్యాణ్ అడ్డ.
- 1000 బైకులతో పిఠాపురం నియోజకవర్గంలో భారీ ర్యాలీ.




**పిఠాపురం, పెన్ సత్తా, మార్చి 14:**పిఠాపురం శాశ్వత శాసనసభ్యులుగా కొణిదెల పవన్ కళ్యాణ్ ఉంటారు అని పిఠాపురం జనసేన శ్రేణులు హర్షధ్వానాలతో హోరెత్తించారు. జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ కేక్ కట్ చేసిన కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి, జన శ్రేణులు, జనసేన నాయకులు, కార్యకర్తలు మధ్య జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ మహోత్సవలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మాజీ శాసనా సభ్యులు పెండెం దొరబాబు, ఓదురి కిషోర్ లు పిఠాపురం ఉప్పాడ సెంటర్లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పిఠాపురం జనసేన పట్టణ నాయకులు ఏర్పాటు చేసిన జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం ఉప్పాడ సెంటర్లో భారీ కేక ని కట్ చేసి కోలాహాల నడుమ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. అక్కడి నుండి భారీ బైక్ ర్యాలీతో బయలుదేరి గొల్లప్రోలు చేబ్రోలు మీదుగా పిఠాపురం పట్టణం చేరుకుని, మార్గమధ్యలో జనసేన జెండాలను ఆవిష్కరించి, పిఠాపురం ఏరియా ఆసుపత్రిలో వృద్ధులకు వికలాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, పిఠాపురం నియోజవర్గానికి శాశ్వత ఎమ్మెల్యేగా కొణిదెల పవన్ కళ్యాణ్ ఎ ఉంటారని, పిఠాపురంలో నిరంతరం జనసేన జెండా రెపరెపలాడుతుందని తెలియజేశారు. ఓటమి నుండి గెలుపు దిశగా వచ్చిన ఏకైక పార్టీ జనసేన పార్టీ అని, అవినీతి మచ్చ లేని పార్టీ జనసేన పార్టీ అని, నాయకుడికి తగ్గ ఆలోచనలతో ప్రతి కార్యకర్త నడుచుకోవాలని, తద్వారా రాబోయే రోజుల్లో జనసేన పార్టీ జాతీయ రాజకీయాలకు దగ్గరవుతుందని తెలియజేశారు. పిఠాపురం నియోజకవర్గంలో కొణిదెల పవన్ కళ్యాణ్ సారధ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా ఒక మోడల్ నియోజకవర్గంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పిఠాపురం నియోజకవర్గం తయారవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పలు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, పలు వార్డు ఇన్చార్జిలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరా పై సందేహాలను కంట్రోల్ రూమ్ ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు




**బాపట్ల, పెన్ సత్తా, మార్చి 14:** గ్యాస్ సరఫరా పై సందేహం ఉన్న యెడల జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు
కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08647 252999 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు అని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల పై జిల్లా పౌరసరఫరాల అధికారి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ వినియోగదారులకు డొమెస్టిక్ సిలిండర్లు సాధారణంగానే సరఫరా కొనసాగుతుందని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. గ్యాస్ సరఫరా పై ఎప్పటి కప్పుడు సమాచారం తెలుసుకొనుటకు కలెక్టరేట్ కార్యాలయం నందుకంట్రోల్ రూమ్ అన్ని పని దీనములో 24 గంటలు అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించవచ్చును అన్నారు. జిల్లాలో వినియోగదారులకు తగిన విదముగా గ్యాస్ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవటం జరిగినది ప్రతి ఏజెన్సీ నందు తహశీల్దార్ ను గ్యాస్ సరఫరా పై పరవేక్షణ కొరకు నియమించటం జరిగినది. కావున ఎవ్వరూ తొందరపడి వెంట వెంటనే గ్యాస్ రీఫిల్లింగ్ కొరకు బుకింగ్ చేసుకోవద్దని, వద్దంతలు నమ్మవద్దని తెలిపారు. వినియోగదారులు గ్యాస్ బిల్లు లో ఉన్న ధర మాత్రమే డెలివరి బాయ్ కి చెల్లించాలని ఏ విదమైన అదనపు రుసుము చెల్లించనవసరం లేదు, ఎవ్వరైన ఎక్కువ మొత్తం డిమాండ్ చేసిన యెడల పిర్యాదు చేయవచ్చు అని తెలియజేసారు. గ్యాస్ సిలిండర్ అక్రముగా నిల్వ చేసి కృతిమ కొరత సృష్టించే వ్యక్తులు సంస్థల పైన, డొమెస్టిక్ సిలిండర్ వాణిజ్య అవసరాల వినియోగించే సంస్థల పైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ యజమానులు వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా నిండు సిలిండర్లు సరఫరా చేయవలయునని పై ప్రకటనలో తెలిపారు.

# వేడుకగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14:**జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అనకాపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణ, మండల కేంద్రాలు, పంచాయతీల స్థాయిలో జనసేన శ్రేణులు వేడుకలను ఘనంగా అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. పట్టణం లోని జనసేన పార్టీ కార్యాలయంలో రామకృష్ణ చేతుల మీదుగా పార్టీ పతాక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ నందు చెట్లు నాటు కార్యక్రమం, జిల్లా ఎన్టీఆర్ హాస్పిటల్ నందు రక్తదాన శిబిరం, రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్లు పంపిణీ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ జన సైనికులకి జననాయకులకి 13 వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కొణిదల పవన్ కళ్యాణ్ సామాన్యులకి అన్యాయం జరుగుతుందని, సామాన్యుల కోసం పోరాటం చేయాలని ఉద్దేశంతో 2007 లో కామన్ మాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థను ఏర్పాటు చేశారని అన్నారు. అనంతరం రాజకీయంగా ప్రజలకు అండగా నిలబడడం కోసం ఒక మంచి ఆశయంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్రానికి మంచి ప్రయోజనాలు చేకూర్చాలని, రాష్ట్ర యువతకు, రైతాంగానికి మంచి భవిష్యత్తు అందించాలని ఉద్దేశంతో ఆదర్శమైనటువంటి పరిపాలన ఉండాలని మంచి ఆలోచనతో 2014 జనసేన పార్టీని స్థాపించారని అన్నారు. ఒక మంచి ఉద్దేశంతో సదుద్దేశంతో నీతి నిజాయితీగా, త్రికరణ శుద్ధిగా, నిస్వార్థంతో ఈ జనసేనపార్టీని మొదలు పెట్టారో ఆయనకి ఈరోజు జరుగుతున్న పరిణామం మంచి నిదర్శనం అన్నారు. ఈ రాష్ట్రం అదోపతి పాలై, ఆర్థికంగా చిన్నాభిన్న మైన రాష్ట్రం పూర్తిగా కోలుకోవాలేని పరిస్థితుల్లో అధికారం లోకి రావడం భగవంతుడు ఆశీస్సులు, కేంద్ర ప్రభుత్వం అండ దండలతో ఈరోజు సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా సమ జోడిగా ఈ రాష్ట్రానికి ఎప్పుడో జరగలేనటువంటి కార్యక్రమాలు ఈ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. ఈ 13 సంవత్సరాలలో అరెస్టులు, ఎన్నో ఇబ్బందులు, ఎన్నో కష్టాలు పడ్డారని అంతులేని విశ్వాసంతో పార్టీని విడనాడకుండా జనసైనికులు, వీర మహిళలు ఏమి ఆశించకుండా నిస్వార్థంగా జననాయకుడు వెంట నిలబడి మేము ఉన్నామని వెన్నుముకగా నిలబడ్డారన్నారు. పార్టీని దిగ్విజయంగా ఇంతకాలం నడిపించినందుకు మీ అందరికీ ధన్యవాదములు అని కొణతాల అన్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేసినప్పుడు కొణిదల పవన్ కళ్యాణ్ చూపిన చొరవను, రోడ్డు పై బైఠాయించి, గత ప్రభుత్వానికి ఎదురెళ్ళి తీరును మరొకసారి జనసేన నాయకులకు గుర్తు చేశారు. ఆరోజు జరిగిన పరిమాణం, తీసుకున్న నిర్ణయం రాష్ట్ర దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడిందని గర్వంగా చెప్పారు. ఈరోజు ఎటువంటి పదవి ఆశించకుండా గత ప్రభుత్వాని గద్దె దించాలని సదుద్దేశంతో తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికి కూటమిగా ఏర్పడి ప్రజలకు మంచి పరిపాలన అందించాలని, పరిపాలన దక్షతలు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి తీసుకుని రాగలరని నమ్మకంతో ఆరోజు మద్దతు పలకడం జరిగిందన్నారు. ఈరోజు పవన్ కళ్యాణ్ నిస్వార్థ రాజకీయాలు చేస్తున్నారు కాబట్టి దేశం లోనూ మంచి రాజకీయ నాయకుడిగా గుర్తింపు వచ్చిందని, దేశ ప్రధాని స్వయంగా ఏ పవన్ నహి హే అంది హే అని, మేర సాత్ పవన్ హే గొప్పగా పొగడారని అన్నారు.

మన జిల్లాలో రైల్వే జోన్ కు అసలు వదులుకున్న సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అది నెరవేరి వచ్చే రెండు నెలలో నిర్మాణ పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు చేపడుతున్నారని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా కూటమి ప్రభుత్వం చేపట్టి నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడినాక విశాఖ, అనకాపల్లి ఆంధ్ర రాష్ట్రానికి మంచి గ్రోత్ ఇంజిన్ గా తయారవుతున్నాయని అన్నారు. ఈ జిల్లాల్లో లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో, ఐటీ కంపెనీలతో పెద్ద కంపెనీలు వస్తున్నాయని, దేశం మొత్తం మీద 25% పెట్టుబడిలో మన ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్నాయని, అందులో అత్యధికంగా మన విశాఖ ఉమ్మడి జిల్లాకి వస్తున్నాయి అన్నారు. అతి త్వరలోనే విశాఖ అతిపెద్ద ప్రపంచ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ హబ్ గా మారిపోతుందని, ఇప్పటికే పెద్ద పెద్ద కంపెనీలు విశాఖపట్నంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో నెలకొల్పుతున్నారని, పక్క రాష్ట్రాలలో ఉద్యోగ అవకాశాలు వెతుక్కోకుండా ఇక్కడే ఎన్నో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ 13 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మనమందరం నాయకుడు అడుగుజాడల్లో నడవాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ అందించే విధంగా కార్యచరణ చేయాలని పిలుపునిచ్చారు. మరొకసారి అందరికి 13 వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు కొణతాల తెలియజేశారు.






# రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి.




- డాక్ యార్డ్ మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన.
- భారీగా రక్తదానం చేసిన ఉద్యోగులు, 90 యూనిట్ల రక్తం సేకరణ

**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 14:**దేశవ్యాప్తంగా రక్త నిల్వలు ఎంతో అవసరమని, కాబట్టి ప్రతి ఒక్కరూ సమాజ బాధ్యతగా భావించి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ శాసనసభ్యులు గణబాబు పిలుపునిచ్చారు. శనివారం ఎన్ఏడి జంక్షన్ కళాక్షేత్రంలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గణబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, వాటిని తగ్గించడంతోపాటు ఎక్కడి కక్కడ అవసర మైన మేరకు రక్త నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలా చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అందువల్ల యువత ఎక్కువగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని గణబాబు కోరారు. మనం చేసే రక్తదానం ఎంతో మందికి ప్రాణం నిలబెడుతుందన్నారు. సామాజిక సేవలో డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ ముందు వరుసలో ఉందన్నారు. రక్షణ రంగంలో విధులు నిర్వహిస్తూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ భవనాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే అధికారుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం ఉంటుందన్నారు.
అన్ని కార్యక్రమాల్లో తనను భాగస్వామ్యం చేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా హాజరైన గాజువాక బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండి యశోదర వేదమణి, ప్రముఖ గైనకాలజిస్ట్ లక్ష్మీ కొండమ్మ బొత్స లు మాట్లాడుతూ సమాజానికి ఎంతో ఉపయోగకర మైన ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేస్తున్న డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ సభ్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. మెగా రక్తదాన శిబిరంలో తమను కూడా భాగస్వాములు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి లు మాట్లాడుతూ అందరి సహకారం తోనే అసోసియేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విద్య ప్రోత్సాహకాలు, వైద్యం, రక్తదాన శిబిరాలు, వన సమారాధన, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో సుమారు 90 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకురాలు ఎస్.
రాజకుమారి, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, కోశాధికారి గంధ్రెడ్డి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి రాజకుమార్, సభ్యులు రమణ, సన్యాసిరావు కాలనీ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు తదితరులతో పాటు పెద్ద ఎత్తున సభ్యులంతా పాల్గొన్నారు.



# అక్షర ఆంధ్ర పరీక్షలను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14 :** నిరక్షరాస్యు లైన స్వయంశక్తి సంఘాల మహిళలకు, గ్రామిణా ఉపాధి హామీపథకం నందలి పని వేతనదారులకు, అక్షరాస్యులను చేయటకు ఉద్దేశించి, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీపథకం నందలి పని వేతనదారులకు, అక్షరాస్యులను చేయటకు నమోదు చేసుని తరగతులు పూర్తి చేసుకున్న అబ్యాసకులకు వారి యొక్క స్థాయిలను అంచనా వేయుట కై నిర్వహిస్తున్న పౌండేషన్ లిటరసీ న్యూమరసీ ఎసెస్మెట్ పరీక్ష (ఎఫ్.ఎల్.ఎన్. ఏ.టి)ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం అక్షరాంధ్ర కార్యక్రమం పై జిల్లా మండల సాయి అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో నేడు (ఆదివారం) నిర్వహించవలసిన ఎఫ్.ఎల్.ఎన్.ఏ.టి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 93,292 మంది అభ్యాసకులు హాజరు ఉవుతున్నారని, ఇందుకుగాను 2,478 మంది ఇన్విజిలేటర్లు, 2,478 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయడ మైనదని అన్నారు. ఆదివారం నిర్వహిస్తున్న ఈ పరీక్షకు డిఆర్డిఏ నుండి 51,500 మంది, డిఏఎంఏ నుండి



32,000 మంది, మేప్మా నుండి 10,292 మంది అభ్యాసకులు హాజరు కానున్నారని, పరీక్షాకేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వెబెక్స్ సమావేశంలో డ్వామా పీడీ పూర్ణిమ దేవి, వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి చిన్నికృష్ణ, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచిదేవి, జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా అధికారి మంజులవాణి, మేప్మా పీడీ పద్మావతి, ఐ సి డి ఎస్ పి డి, మండల ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి.

- అనకాపల్లిలో మహిళా పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన.
- శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ విజయ క్రిష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** పరిశ్రమల ఏర్పాటులో మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించి, ఆర్థిక సాధికారత సాధించేందుకు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడే శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం, కోడూరు లోని ఏపీఐఐసీ షెజ్లో ఎంఎస్ఎంఈ పార్కు సమీపంలో ఏఎల్ఏపీకి సుమారు 31.77 ఎకరాలలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిండంతో, ఎలిప్ మహిళా శక్తి భవన్ పరిపాలన భవనం, శిక్షణ కార్యాలయాన్ని నిర్మించేందుకు శనివారం ఉదయం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎలీప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి లతో కలసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళా సాధికారత దిశగా కీలక అడుగు పడిందని, సుమారు 31.77 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్న మహిళా పారిశ్రామిక పార్కుకు నేడు ఘనంగా శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నాటికి రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని, అందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. మహిళలు తమలో ఉన్న ఆలోచనలను వ్యాపార రూపం లోకి మార్చు కోవాలని, అందుకు ప్రభుత్వం, ఎలీప్ వంటి సంస్థలు పూర్తి సహకారం అందిస్తాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలీప్ సంస్థ అందిస్తున్న శిక్షణ, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని కలెక్టర్ కొనియాడారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ప్రభుత్వం.

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చే ప్రాధాన్యతకు ఈ పారిశ్రామిక పార్కు ఒక నిదర్శనమని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు, అన్ని రంగాల్లో వారికి అవసర మైన తోడ్పాటును ఈ పార్కు ద్వారా అందించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారీ సబ్సిడీని ముఖ్యమంత్రి ప్రకటించారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం శుభపరిణామమని, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ సమిష్టిగా కృషి చేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపు నిచ్చారు.




అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలీప్ సంస్థ అందిస్తున్న శిక్షణ, తోడ్పాటును అభినందించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, దీనిని మహిళలు అందిపుచ్చు కోవాలని కోరారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, మాట్లాడుతూ మహిళా సాధికారతకు సామాజిక అభివృద్ధి, భవిష్యత్తుకి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎలీప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి, పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఘటాలు ఊరేగింపులు ప్రారంభించిన కొణతాల





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** నూకంబిక అమ్మవారి దేవస్థానం సహకారంతో నూకంబిక అమ్మవారి మాల ధారాల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో శనివారం కొత్త అమావాస్య, జాతర సందర్భంగా ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధను దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ,

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ ఘటాలు ఊరేగింపులు ప్రారంభించారు. ఊరేగింపులో నియోజవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్కి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డిసి ఎన్ సుజాత పాల్గొన్నారు.

అమ్మవారి ఘటాలతో శోలాలు, అమ్మవారి డాన్సులు, పులి వేషాలు, దాండియా డాన్స్, తంబోలా డ్రమ్స్, పలు సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారు అలంకరణలతో నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమ్మవారి నామస్మరణతో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, బిఎస్ఎన్ జోగి నాయుడు, సంఘ సేవకుడు కాంద్రేగుల శ్రీరామ్,

ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, కూటమి పార్టీ నాయకులు, మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జనసేన పార్టీ 13 వ ఆవిర్బవ దినోత్సవం కార్యక్రమం






**మునగపాక, పెన్ సత్తా, మార్చి 14:** మండలం లోని వెంకటాపురం గ్రామంలో జరిగిన జనసేన పార్టీ 13 వ ఆవిర్బవ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జనసేన గ్రామ అధ్యక్షురాలు సుందరపు ధన లక్ష్మి ఆధ్వర్యంలో జెండా ఎగరవేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కమిటీ మెంబెర్ శివకృష్ణ, బుజ్జి, జనసేన పార్టీ వార్డ్ నెంబర్ సత్యశ్రీ, కూటమి నాయకులు సుందరపు కనక వెంకట అప్పారావు, కడియం అనురాధ, మాధవ వర్మ, కాసులబాబు, చిన్ని దేవి, బలిరెడ్డి శ్రీనివాసరావు(బీజేపీ), జనసేన నీటిసంగ అధ్యక్షుడు అప్పికొండ వెంకట్, ఉప అధ్యక్షుడు బి.సంతోష్, డైరెక్టర్ ఎస్. సంతోష్, జనసైనికులు వినయ్, ప్రవీణ్, మోహన రావు, శ్రీనివాస రావు, పెంటరాజు, కిషోర్, గోవింద్, జనసైనికులు, వీరమహిళలు నూకరత్నం, విశాలక్ష్మి, నాగ మని, బుజ్జి, లక్ష్మి జనసైనికులు, వీరమహిళలు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గున్నారు.

# కొత్త అమావాస్య పండగ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్ సుజాత



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** రాష్ట్ర పండగ, ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకంబిక అమ్మవారి దేవస్థానంలో శనివారం కొత్త అమావాస్య పండగ ఏర్పాట్లను పరిశీలించిన పండగ ప్రత్యేక అధికారిణి ఎన్ సుజాత. ఈ సందర్భంగా ఆమె ఆలయమంతా పరిశీలించి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు, ఆలయ సిబ్బంది కి తెలియజేశారు. క్యూలైన్లు, చలవ పందిళ్ళను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేషి తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి ఘనంగా పెల్లి రాట ఉత్సవం

ఉపమాక లో ఈనెల 20 నుండి సప్తాహం ప్రారంభం



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** నక్కపల్లి మండలం, ఉపమాక రామాలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవ పెళ్లి రాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని గ్రామ పెద్దలు, ఆలయ నిర్వహకులు, మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణ ముహూర్తపు రాటను వేశారు . ఈనెల 27న జరిగే శ్రీరామనవమి సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించే 4వ సప్తాహం (7 రోజులపాటు నిర్విరామముగా నిర్వహించే భజన కార్యక్రమం ) ఈ నెల 20 నుండి ప్రారంభమవుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో వివిధ గ్రామాల నుండి ప్రముఖ భజన బృందాలను పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆఖరి రోజున శ్రీ సీతారాములు వారి కళ్యాణం ఘనంగా నిర్వహిస్తారు.ఈ కార్యక్రమం లో నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు,సిద్ధాబత్తుల కృష్ణ,కొప్పిశెట్టి శ్రీను,ప్రగడ బుజ్జి,తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు, బద్ది హరి, సిద్ధాబత్తుల సత్తిబాబు, అనపర్తి జగ్గారావు,కొప్పిశెట్టి వెంకటేష్ మరియు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలించిన హోం మంత్రి అనిత





**నక్కపల్లి, పెన్ సత్తా,మార్చి 14:** నక్కపల్లి మండలంలో ఏర్పాటు కాబోయే స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ప్రాంతాన్ని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత స్థానిక నాయకులు తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ నెల 23న నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారని ఆమె తెలిపారు. స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. అధికారులతో కలిసి వేదికను, పరిసర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి భారీ స్థాయిలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశానికి వచ్చే ప్రజలకు భద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా శంకుస్థాపన వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. డి. ఓ. వి. వి. రమణ తహశీల్దార్ ధరావత్ శ్రీను, సిఐ మురళి, ఎస్ ఐ సన్ని బాబు వివిధ శాఖ ల అధికారులు మరియు టి. డి. పి. నాయకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి పీఆర్‌పీఏ డిమాండ్



**చింతకాని పెన్ సత్తా,మార్చి 14:** చింతకాని : ఖమ్మం జిల్లా నాగులవంచలో పీఆర్‌పీఏ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీఆర్‌పీఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) మాట్లాడుతూ 2024 మార్చి తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులు తమ సేవా కాలంలో దాచుకున్న సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 700 కోట్ల రూపాయలు మంజూరు చేయడం సమస్యకు పూర్తి పరిష్కారం కాదని ఆయన తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత 22 నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి బకాయిలు ఇప్పటికీ చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మనోవేదనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని రిటైర్డ్ ఉద్యోగులు సేవాకాలంలో దాచుకున్న సొమ్మును విడుదల చేసి, వారు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల నుండి విముక్తి కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్. మధుసూదన్ రెడ్డి, జి. చంద్రశేఖర్, నంజాల పుల్లయ్య, అంబటి శాంతయ్య, డి. శివ నారాయణ రెడ్డి, ఎం. బాబురావు, తాత రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమం భాగం ఫౌండేషన్



**చింతకాని పెన్ సత్తా,మార్చి 14:** భాగం ఫౌండేషన్ (అమెరికా) స్వచ్ఛంద సంస్థ అధినేత శ్రీ రాకేష్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నామవరం లో చదువుతున్న మరియు రేపటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రి అయిన జు×ఖుఎ ్ఖున, రెండు పెన్నులు మరియు ాశీఅస్త్ర ాఖ్మశ్రీవ లను అందజేశారు.
ఈ కార్యక్రమంలో శ్రీ రాంబాబు శ్రీ వెంకటేశ్వరరావు విద్యార్థులకు ఆ సామగ్రిని పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా శ్రీ రాంబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బోనకల్ సమీపంలోని గోవిందాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం అమెరికాలో ఉన్నప్పటికీ తన జన్మభూమిని మరవకుండా భాగం ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ రాకేష్ సేవలను ప్రశంసించారు.
అలాగే, ప్రతి సంవత్సరం మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ₹5,000 నగదు బహుమతి అందజేస్తున్నారని తెలిపారు. నామవరం పాఠశాల విద్యార్థులు కూడా ఈ సంవత్సరం 100% ఫలితాలు సాధించడంతో పాటు మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ చీ. సుధాకర్ రావు , సహోపాధ్యాయులు శ్రీమతి అనిత, శ్రీ శ్రీనివాసరావు, శ్రీ ఉమా మహేశ్వరరావు, శ్రీ సురేష్, శ్రీమతి నాగమణి, శ్రీమతి హసీనా, శ్రీమతి కవిత మరియు ాూూాజ చైర్మన్, సభ్యులు పాల్గొని దాత శ్రీ రాకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై, యువత భవిష్యత్తు

### ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి



**చేగుంట: పెన్ సత్తా,మార్చి 14:** చేగుంట పట్టణ కేంద్రంలో శనివారం నాడు, దేశంలోనే విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాలు,నాశనం చేస్తున్నాయని చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. ఈరోజు మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే "నశా ముక్త భారత అభియాన్"ప్రధాన ఉద్దేశం గా మెదక్ చౌరస్తా లో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ గుణంకాల ప్రకారం 25 ఏళ్లలోపు యువత అధికంగా బానిసలు అవుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. మాదక ద్రవ్యాలు మానసిక, శారీరిక ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలు అని, ఇవి యువతను చెడు మార్గంలో నడిపిస్తాయని, చదువులో వెనకబడేలా చేస్తాయన్నారు. ఒకసారి దీనికి బానిసైతే ఎంతటి ఆకృత్యాలు నేరాలు చేయడానికి వెనకాడనన్నారు. ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని తగు సూచనలు తెలిపి ,మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ,ఎస్ఐ, సంయోద్దీన్ పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, బోనాల సర్పంచ్ రాములు, మొహమ్మద్ అలీ,తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు గ్రామ పెద్దల అభినందనలు



**చింతకాని పెన్ సత్తా,మార్చి 14:** చింతకాని మండలం నాగులవంచగ్రామంలో నుండి ప్రారంభమైన టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల సందర్భంగా గ్రామ పెద్దలు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పుష్పాలు అందజేసి "ఆల్ ది బెస్ట్" చెబుతూ వారి విజయాన్ని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, మంచి ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వంకాయలపాటి వెంకట లచ్చయ్య, వంకాయలపాటి త్రివేణి, వంకాయలపాటి శివ, సామినేని బాబురావు, తోటకూరి నాగేశ్వరరావు, అంబటి సైదేశ్వరరావు, శ్రీ గ్లోబల్ హై స్కూల్ కరస్పాండెంట్ ఇనుకుల దివాకర్ రెడ్డి మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
ఫోటోలో గ్రామ పెద్దలు విద్యార్థులకు పుష్పాలు అందజేస్తూ అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం కనిపిస్తోంది.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



**చింతకాని పెన్ సత్తా,మార్చి 14:** చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు అన్నారు. శుక్రవారం తిర్లాపురం గ్రామంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద అన్న - తమ్ముడు సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేద్రంను సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని, నిత్యం పరిసర గ్రామాల నుంచి ఖమ్మం పట్టణానికి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని ఇది ఒక పుణ్యకార్యంగా, మానవీయ కోణంలో నిర్వహించబడే సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు చాపల మడుగు మధు రేణుక దంపతులు, చాపలమడుగు బ్రదర్స్ ఆర్మీ- ప్రణయ్, అంగనవాడి టీచర్ నాగసీతారత్నం, గోగుల నరసింహారావు ,గోధా రాధమ్మ , ప్రశాంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## సొంత ఇంటి కల సహకారం.....



**చింతకాని పెన్ సత్తా,మార్చి 14: ప్రతినిధి.** చింతకాని మండలం రాఘవపురం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ పథకంలో భాగంగా గ్రామంలో మంజూరైన సింగారపు రామలింగం, గొరిటాల కస్తూరి ఇందిరమ్మ ఇల్లు పూర్తయి గృహప్రవేశం జరిగింది, ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కటింగ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంపల్లి కోటమ్మ, కొల్లి గోవిందరావు, పెంట్యాల అప్పారావు, దొబ్బల నరసింహారావు, కొల్లి రవికుమార్, అబ్బూరి మహేష్, కొండపర్తి బాలాజీ, దొబ్బల సీతమ్మ, సింగారపు నాగమ్మ, కనపర్తి సత్యనారాయణ, వడ్డే వీర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతి పరీక్షల కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు జిల్లా ఎస్పీ



**సత్యసాయి, పెన్ సత్తా, మార్చి 14:** మార్చి 16, నుండి ఏప్రిల్ 1, వరకు జిల్లాలో జరగనున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 107 పరీక్ష కేంద్రాలలో 22,303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు (144 సెక్షన్) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుండి మద్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు విద్యార్థులు తమ హాల్ టికెట్లతో సకాలంలో హాజరు కావాలసిందిగా సూచించారు. పరీక్ష కేంద్రం లోనికి సెల్ ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. ప్రజలు పరీక్ష కేంద్రం వద్ద గుంపులుగా తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర ఎవరూ కూడా పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం పరిసరాలలో 200 మీటర్ల దూరం వరకు ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించడం జరిగిందన్నారు. పరీక్షకు సంభందించి సోషల్ మీడియాలో ఎలాంటి అసత్య ప్రచారాలు చేసిన నమ్మరాదని, ప్రత్యేక బందోబస్తు నడుమ పరీక్షలు జరుగుతాయని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వ్యక్తుల పై జిల్లా పోలీసు కేంద్రం నుండి ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాంత మైన వాతావరణంలో పరీక్షలు రాసుకోవాలని కోరారు.

## నియోజకవర్గ అభివృద్ధి కి భారీ నిధులు

హోంమంత్రి అనిత



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేసామని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత అన్నారు. నక్కపల్లిలోని క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరవుతున్నాయని మంత్రి తెలిపారు.
అలాగే నక్కపల్లి, యస్. రాయవరం మండలాల ప్రజల దశాబ్దాల కల నెరవేరేలా వైద్యం మరియు విద్యా రంగాల్లో కీలక నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని రూ. 32. 80 కోట్లతో 100 పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతో పాటు ట్రోమా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి లభించిందన్నారు. అలాగే పెనుగొళ్ళు ఆసుపత్రి అభివృద్ధికి మరో రూ. 50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో భాగంగా జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు.
పాయకరావుపేట నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అనిత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో నాయకులు సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు ఉన్నారు.

## విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిశీలకులుగా వీసం రామకృష్ణ - వీసం ను అభినందించిన వైసీపీ నేతలు



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 14:** విశాఖపట్నం దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నియమితులయ్యారు.
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి పార్టీ కేంద్ర కార్యాలయం నుండి నక్కపల్లి మండలం, నక్కపల్లి కి చెందిన సీనియర్ నేత వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణకు విశాఖ సౌత్ నియోజకవర్గ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అప్పగించిన బాధ్యతలను విశాఖ సౌత్ పార్లమెంటరీ పరిశీలకులు, కోఆర్డినేటర్ల సమన్వయంతో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

## ఎడిటోరియల్

# మధ్యప్రాచ్యంలో యుద్ధ మంటలు ఆరేదెపుడు..!

మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల మంటలు పరాకాష్టకు చేరాయి. ఫిబ్రవరి 28, 2026 రోజు ఇరాన్ అత్యున్నత నాయకుడైన అయొతొల్లా అలీ ఖమేనీని హత్య చేసింది మొదలు గత 14 రోజులుగా కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధంలో అగ్రరాజ్యమే అధికంగా ఆస్తి, ప్రాణ నష్టాలను మూటకట్టుకుంటున్నది. నేడు ఇరాన్ యుద్ధ వ్యూహాల ముందు అమెరికా-ఇజ్రాయిల్ అత్యాధునిక ఆయుధాలు వెలవెలబోతున్నాయి. ఆయుధ సంపత్తి కన్న వ్యూహాలే విజయాన్ని తెస్తాయని నేడు ఇరాన్ రుజువు చేస్తున్నది. యుద్ధ తీవ్రత పెరిగిన కొద్ది ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. వంట గ్యాస్ కొరతతో పర్యాటకం, సామాన్యుల వంటిళ్లు, హోటల్స్, పరిశ్రమలు, రవాణా వ్యవస్థలు కుదేలు అవుతున్నాయి. 'హోర్మోజ్ జలసంధి(స్ట్రైట్ ఆఫ్ హర్మోజ్)" గుండా చమురు-ఎల్పీజీ రవాణాను అడ్డుకొని ప్రపంచ దేశాలకు ఇంధన కొరత సృష్టించడం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచడం, తక్కువ ఖర్చు కలిగిన డ్రోన్ బాంబులను ప్రయోగిస్తూ వాటిని అడ్డుకోవడానికి అమెరికా-ఇజ్రాయిల్ అధిక ఖర్చు కలిగిన క్షిపణులను వాడటానికి పురికొల్పడం లాంటి ఇరాన్ వ్యూహాలు నేడు అగ్రరాజ్యానికి చెమటలు పుట్టిస్తున్నాయి. యుద్ధంలో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా, ప్రపంచ దేశాల సామాన్య ప్రజలు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తున్నది. చమురు, వంట గ్యాస్ సరఫరా ఆగిపోవడంతో నేడు ప్రపంచ దేశాల్లో వంటింటిలో మంటలు ఎగిసిపడుతున్నాయి. బ్యారెల్ చమురు ధర 59 డాలర్ల నుంచి నేడు యుద్ధం కారణంగా 120 డాలర్లకు చేరడం వల్ల చమురు, వంట గ్యాస్‌తో పాటు సరుకుల ధరలు ఆకాశానంటుతున్నాయి. రానున్న రోజుల్లో చమురు ధరలు 200 డాలర్లకు చేరి ప్రపంచ దేశాలు ద్రవ్యోల్బణ ఉచ్చులో చిక్కి గిలగిలా కొట్టుకోవడం తప్పనిసరి అని తోస్తున్నది. వెనెజ్వెలాలో 03 జనవరి 2026 రోజున 'నికోలస్ మదురో'ను నిర్భంధించిన అమెరికా అక్కడ తన కీలుబొమ్మకు పాలన పగ్గాలు కట్టబెట్టడం చూసాం. ఇరాన్ వద్ద ఉన్న 400 కేజీల శుద్ధి చేసిన యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు ఈ యుద్ధాన్ని ప్రారంభించాయి. అణ్వాయుధాలను ఇజ్రాయిల్‌పై వాడవచ్చనే భావనతో ఇరాన్‌పై యుద్ధం ప్రకటించిన అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు నేడు భారీ మూల్యాలను చెల్లిస్తున్నాయి. తమకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న అలీ ఖమేనీని చంపి, అతని స్థానంలో తమకు నచ్చిన పాలకుడిని సుప్రీమ్ లీడర్‌గా నియమించాలని కలలు కన్న అమెరికా-ఇజ్రాయిల్ వ్యూహాలు బెడిసికొట్టినట్లు స్పష్టం అవుతోంది. యుద్ధం తొలి రోజు ఇరాన్ నిరంకుశ అగ్ర నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీని బాంబులు వేసి మట్టుబెట్టి విజయం సాధించామని పలుకులు పలికిన అమెరికా-ఇజ్రాయిల్ నేడు ఆచితూచి యుద్ధాన్ని కొనసాగించాల్సి వస్తున్నది. గడిచిన 14 రోజుల్లో ఇరాన్‌కు చెందిన 1200 మంది మరణించగా, దాదాపు 5,000 వరకు గాయపడినట్లు వివరాలు తెలుపుతున్నాయి. అదే విధంగా 10 మందికి పైగా అమెరికా సైనికులు మరణించడం, 150 వరకు గాయపడడంతో పాటు ఇరుగుపొరుగు దేశాల్లో ఉన్న 22 అమెరికా సైనిక-విమానయాన స్థావరాలపై ఇరాన్ దాడులు చేయడంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లుతున్నది. 13 మార్చి రోజు తాజాగా పశ్చిమ ఇరాన్‌లో అమెరికన్ విమానం కూలిపోయిన ఘటనలో నలుగురు సిబ్బంది మరణించినట్లా నిర్థారణ అయ్యింది. ఈ యుద్ధంలో ఇడ్రాయిల్‌కు చెందిన కనీసం 15 మంది మరణించగా, 2,000 వరకు గాయపడినట్లు తెలుస్తున్నది. అమెరికా అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించుకుంటూ ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు భారీ నష్టాలను కలిగిస్తున్నాయి. కువైట్, ఖతార్, బెహ్రెయిన్, దుబాయ్ లాంటి గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు, రాయబార కార్యాలయాలు, చమురు శుద్ధి కేంద్రాలను కేంద్రంగా చేసుకొని ఇరాన్ విరుచుకుపడుతున్నది. అమెరికా-ఇజ్రాయిల్ చేస్తున్న తీవ్రమైన దాడుల్లో ఇరాన్‌లోని సైనిక, వైమానిక, నావికా, బ్యాంకులు, అతి ముఖ్యమైన కేంద్రాలు పూర్తిగా నేలమట్టం అవుతున్నాయి. ఈ యుద్ధంలో ప్రత్యర్థి దేశాల వనరుల విధ్వంసం, ఆర్థికంగా బలహీన పరచడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ నష్టాన్ని కలిగించడం, సైనిక బలగాల ధైర్యాన్ని బలహీన పరచడం, సిబ్బందికి ప్రాణహాని తలపెట్టడం లాంటి లక్ష్యాలతో కూడిన వ్యూహాలను నేడు ఇరాన్ అమలు చేయడాన్ని "వార్ ఆఫ్ అట్రిషన్" అని పిలుస్తున్నాం.

అలీ ఖమేనీ స్థానంలో సుప్రీమ్ లీడర్‌గా ఎంపికైన అతని కుమారుడిని కరుడుగట్టిన ఉగ్రనేత 'మొజ్తాతా ఖమేనీ' కూడా నిరంకుశ పాలకుడిగా తన సత్తాను చాటుతున్నారు. ఈ నూతన ?తను కూడా హత్య చేస్తామంటూ నెతన్యాహు బీజాలు పలుకుతున్నారు. యుద్ధ నీతి నియమాలకు విరుద్ధంగా పాఠశాలలు, ఆసుపత్రులు, పౌర ఆవాసాలను సహితం లక్ష్యంగా చేసుకొని అమెరికా-ఇజ్రాయిల్ దాడులు జరుగుతున్నాయి. అత్యంత ఖరీదైన అమెరికల్ ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు, రూ: 250 కోట్ల విలువైన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, 22 వేల కోట్ల విలువైన థాడ్ రక్షణ వ్యవస్థల రాడార్ కేంద్రాలను ఇరాన్ డ్రోన్లు విధ్వంసం చేయడం జరుగుతున్నది. కొద్ది రోజుల్లో ముగుస్తుందనుకున్న ఈ యుద్ధం కొనసాగడంతో అమెరికా ఇప్పటికే రోజుకు సుమారు 2 బ్లియన్ డాలర్ల ఖర్చు చేస్తున్నది. కేవలం మొదటి వారంలోనే రూ 51 వేల కోట్ల ఖర్చు చేసింది. ఇరాన్ ప్రయోగిస్తున్న చవకైన షాహెడ్ డ్రోన్లను అడ్డుకోవడానికి లక్షల డాలర్ల విలువైన క్షిపణులను అమెరికా వాడాల్సి రావడంతో అగ్రరాజ్యం భారీ నష్టాలను మూటకట్టుకుంటున్నది. ఈ యుద్ధం వల్ల అభివృద్ధి చెందుతున్న భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాలు అధికంగా ప్రభావితం అవుతున్నాయి.

ఇరాన్‌పై అమెరికా ప్రకటించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"తో పాటు ఇజ్రాయిల్ చేపట్టిన "ఆపరేషన్ రోరింగ్ లయన్" వల్ల ఇరాన్ కొద్ది రోజుల్లో తమ దారికి వస్తుందని ఊగహించిన అమెరికా-ఇజ్రాయిల్ దేశాలకు ఈ యుద్ధ ముగింపు దగ్గర్లో కనిపించడంతో లేదు. ఇరాన్ చేస్తున్న ఈ యుద్ధంలో తమ ఐఆర్‌జీసీ సైనిక బలగాలు ముందుండి తీవ్రంగా ప్రతిఘటించడం, ఎదురు దాడులు చేయడం చూస్తున్నాం. నేడు ఇరాన్‌తో పాటు హెజ్బుల్లా వర్గాలను మట్టుబెట్టడానికి అమెరికా-ఇజ్రాయిల్ వ్యూహాలు పన్నుతున్నది. "గ్లోబల్ ఫైర్‌పవర్ సూచిక"లోఅమెర్కా ప్రథమ స్థానంలో ఉండగా ఇజ్రాయిల్ 15వ స్థానంలో, ఇరాన్ 16వ స్థానంలో ఉన్నాయి. ఈ సూచికలో భారత్ 4వ స్థానం ఉందని గమనించగలరు. హోర్మోజ్ జలసంధికి ఇరువైపులా ఉన్న భారత్‌కు చెందిన 28 వ్యాపార నౌకలను సురక్షితంగా రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేబడుతున్నది. డొనాల్డ్ ట్రంప్ పెట్టిన చిచ్చు ఇప్పట్లో ముదిసేలా లేదు. ఇరాన్ పని అయిపోయిందంటూ ప్రకటనలు చేస్తున్న ట్రంప్ అంతరంగంలో ఓటమి భయం మొదలైంది. నేడు యుద్ధ విరమణకు ఇరాన్ చట్టబద్దమైన హక్కుల పరిరక్షణ, నష్టపరిహారం చెల్లింపు, భవిష్యత్తు దురాక్రమణకు వ్యతిరేకంగా హామీ ఇవ్వడం లాంటి మూడు షరతులను ఇరాన్ విధిస్తున్నది. ఇప్పటికైనా ట్రంప్, నెతన్యాహూ, మొజ్తాతా ఖమేనీలకు సత్వరమే సద్బుద్ధి కలగాలని, యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడాలని, ప్రపంచ శాంతి నెలకొనాలని, ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

# నల్లశనగలతో అద్భుతమైన ఆరోగ్యం..!



మన రోజువారీ ఆహారంలో పప్పుదినుసులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందులో ముఖ్యంగా నల్ల శనగలు (కల చనా) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల నల్ల శనగలను సూపర్ ఫుడ్‌గా కూడా పరిగణిస్తారు. ఇవి శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు అనేక రకాల వ్యాధులను దూరం చేయడంలో సహాయపడతాయి. నానబెట్టిన నల్లశనగలు రోజు ఒక వంద గ్రాములు తిన్నారంటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. అంతేకాదు, మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. శరీరానికి కావాల్సిన పోషకాలు: నల్ల శనగల్లో ప్రోటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మాగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి కండరాల పెరుగుదలకి సహాయపడతాయి. ముఖ్యంగా శాకాహారులు ప్రోటీన్ కోసం నల్ల శనగలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నల్ల శనగల్లో ఉన్న విటమిన్లు, ఖనిజాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల చిన్నపాటి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరుస్తాయి: నల్ల శనగల్లో ఉన్న ఫైబర్ జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా జరగేలా చేస్తుంది. కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తహీనత నివారణ: నల్ల శనగల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారు నల్ల శనగలను ఆహారంలో చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. గుండె ఆరోగ్యం మెరుగుదల: నల్ల శనగల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. బరువు తగ్గడంలో సహాయం: నల్ల శనగల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. అందుకే డైట్ ఫాలో అయ్యే వారు నల్ల శనగలను తమ ఆహారంలో చేర్చుకుంటారు. నల్ల శనగలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే కూరలు, సలాడ్లు, స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. పోషకాలు సమృద్ధిగా ఉన్న నల్ల శనగలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఆహారం. రోజూ పరిమిత మోతాదులో వీటిని తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడి, గుండె ఆరోగ్యం బాగుండి, శరీరానికి శక్తి లభిస్తుంది. అందుకే నల్ల శనగలను ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.


# పుచ్చకాయ గింజలు తింటున్నారా..?



వేసవిలో పుచ్చకాయకు అధిక ప్రాధాన్యత ఉంది. 100 గ్రాముల పుచ్చకాయలో కేవలం 16 శాతం కేలరీలు, 96 శాతం నీరు ఉంటాయి. ఇది కేలరీలు తక్కువగా ఉండే, మంచి నీటిని అందించే పండు.. సాయంత్రం వేళల్లో లేదా భోజనానికి ముందు తీసుకోవడం ద్వారా ఆకలిని పెంచుతుంది.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మధుమేహులు, పిల్లలు కూడా నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. వేసవికాలం వచ్చిందంటే చాలామందికి ముందుగా గుర్తుకువచ్చేది పుచ్చకాయ. శరీరానికి చల్లదనాన్ని అందించడానికి, వేడిని తగ్గించడానికి ఇది ఒక అద్భుతమైన పండు.. పుచ్చకాయ 90శాతానికి పైగా నీటిని కలిగి ఉండి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో, బరువు తగ్గడంలో, గుండె ఆరోగ్యానికి (లైకోపీన్ వల్ల) చాలా మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు ం, అ, పొటాషియం, సిట్రులిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం, రక్తపోటును అదుపు చేయడం, కండరాల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి.పుచ్చకాయలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. 100 గ్రాముల ఎర్రటి పుచ్చకాయ ముక్కల్లో కేవలం 16 కేలరీల శక్తి మాత్రమే ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవడానికి, అర కిలో పుచ్చకాయ తిన్నా, అది ఒక బజ్జీ లేదా సమోసాకు సమానమైన కేలరీలను మాత్రమే ఇస్తుంది. అంటే, అధిక కేలరీలుండే వేరే ఆహార పదార్థాలతో పోలిస్తే, పుచ్చకాయ ద్వారా శరీరానికి తక్కువ శక్తి లభిస్తుంది.పుచ్చకాయలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి కావాల్సిన హైడ్రేషన్‌ను అందిస్తుంది. ఖర్భూజా వంటి పండ్లతో పోలిస్తే పుచ్చకాయలో విటమిన్లు, మినరల్స్, సాల్ట్స్ తక్కువగా ఉంటాయి. అయినప్పటికీ, దాని తియ్యని రుచి, చల్లదనం, ఎర్రటి రంగు కారణంగా వేసవిలో పుచ్చకాయ ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇది ఎంప్టీ కేలరీలు అందించే ఒక మంచి పండు. పుచ్చకాయను సరైన సమయాల్లో తీసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం 5 నుండి 5:30 గంటల మధ్య ఒక గ్లాసు పుచ్చకాయ రసం తాగడం లేదా ముక్కలు తినడం మంచిది. పిల్లలు పాఠశాల నుండి ఇంటికి వచ్చినప్పుడు, ఆడుకోవడానికి వెళ్లే ముందు దీనిని అందించడం వల్ల వారికి మంచి ఆకలి పుడుతుంది. భోజనానికి, రాత్రి భోజనానికి అరగంట నుండి గంట ముందు పుచ్చకాయ ముక్కలు లేదా రసం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఆకలిని పెంచుతుంది, పొట్టలో చల్లగా, హాయిగా అనిపిస్తుంది. ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారికి కూడా ఉపశమనం లభిస్తుంది.


పుచ్చకాయను కడుపు నిండా తినవచ్చు. తక్కువ కేలరీలతో సంతృప్తి లభిస్తుంది. షుగర్ ఉన్నవారు కూడా పుచ్చకాయను భయం లేకుండా తీసుకోవచ్చు.. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు. వృద్ధులు, పిల్లలు, పసి పిల్లలకు కూడా పుచ్చకాయ ముక్కలు లేదా రసం చాలా మంచిది.

# మనిషి శరీరంలో క్యాన్సర్ ఎలా పుడుతుంది..?



క్యాన్సర్ అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, ఎన్ని రకాలు అనే భయం చాలా మందిలో ఉంటుంది. కణాల అనియంత్రిత పెరుగుదలతో శరీరంలో క్యాన్సర్ మొదలవుతుంది. దీనికి చరిత్ర, వివిధ వ్యాప్తి మార్గాలు, అవయవాలు, కణాల ఆధారంగా వర్గీకరణలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు ఈ వ్యాధిపై కొత్త ఆశను రేకెత్తిస్తున్నాయి. క్యాన్సర్ అనే పేరు వినగానే చాలా మందికి మదిలో భయం మొదలవుతుంది. అసలు క్యాన్సర్ అంటే ఏంటి? అది మానవ శరీరంలో ఎలా పుడుతుంది? ఎన్ని రకాల క్యాన్సర్లు ఉన్నాయి? వాటిలో ఏది అత్యంత ప్రమాదకరమైనది? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. . క్యాన్సర్ ప్రస్తావన గ్రీకు, రోమన్ పుస్తకాల్లో ఉంది. క్రీస్తు పూర్వం 470, 370 మధ్యలో గ్రీకు వైద్యానికి పితామహుడిగా భావించే హిప్పోక్రటిస్ తొలుత క్యాన్సర్‌కు సంబంధించి కార్సినోస్ లేదా కార్సినోమా అనే పదాలను వాడారు. కార్సినోస్ అంటే గ్రీకు భాషలో పీత అని అర్థం. క్యాన్సర్ రోగులలో కనిపించే గట్టి గడ్డలు, అవి ఒక భాగం నుంచి మరో భాగానికి వ్యాపించడం, తుదిదశలో భరించలేని నొప్పి వంటి లక్షణాలను పీత గట్టి వెనుక భాగం, కాటుతో వచ్చే నొప్పికి పోల్చడం ద్వారా ఈ పేరు వచ్చింది. గ్రీకు ఫిజిషియన్ గాలిన్ అంకోస్ (గ్రీకులో ఉబ్బడం) అనే పదాన్ని ప్రసిద్ధం చేశారు. రోమన్ ఫిజిషియన్ సెల్సస్ తొలుత లాటిన్ పదం క్యాన్సర్‌ను వాడారు. 17వ శతాబ్దంలో మైక్రోస్కోప్‌ను కనుగొన్న తర్వాతే క్యాన్సర్‌పై పరిశోధనలు మొదలయ్యాయి. 19వ శతాబ్దంలో వైద్య పురోగతితో క్యాన్సర్ రహస్యం మరింత బయటపడటం మొదలైంది. మానవ శరీరం కోట్లకొద్దీ కణాలతో రూపొందుతుంది. కొత్త కణాలు పుట్టడం, వాటి పనులు నిర్వర్తించడం, వాటి పని పూర్తయిన తర్వాత నశించడం, మళ్ళీ కొత్త కణాలు పుట్టడం అనేది శరీరంలో జరిగే ఒక నియంత్రిత ప్రక్రియ. కణాలలోని జన్యువులు ఈ ప్రక్రియను నియంత్రిస్తాయి. అయితే, కార్సినోజెన్ ఎక్స్‌పోజర్, ఇన్ఫెక్షన్లు (వైరల్ ఇన్ఫెక్షన్లు), లేదా వంశపారంపర్యం వంటి కారణాల వల్ల ఈ జన్యువులలో మ్యుటేషన్ సంభవిస్తే, కణాలు నియంత్రణ కోల్పోయి అనియంత్రిత స్థాయిలో పెరుగుతాయి. వాటి పరిమాణం, సహజత్వంలో మార్పులు సంభవిస్తాయి. దీన్నే క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ కణాలు నశించవు, వ్యాధి నిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకుంటూ శరీరంలో ఒక భాగం నుంచి మరో భాగానికి విస్తరించి, ఇతర కణాలను, అవయవాలను దెబ్బతీస్తాయి. సాధారణ గడ్డలకు భిన్నంగా క్యాన్సర్ కణితులు శరీరంలోని ఏ భాగానికైనా విస్తరించగలవు.

# తిన్న కాసేపటికే మళ్లీ ఆకలిగా అనిపిస్తుందా?



ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. చాలా మందికి భోజనం చేసిన కాసేపటికే ఆకలిగా అనిపిస్తుంటుంది. దీంతో స్వీట్లు వంటి ఇంట్లో ఉన్న డిజర్ట్స్ లాగించేస్తుంటారు. అసలు ఇలా ఎందుకు అనిపిస్తుందో మీరెప్పుడైనా ఆలోచించారా? నిజానికి.. మీ ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. దీని అర్థం శరీరంలోని ఇన్సులిన్ హార్మోన్ రక్తం నుంచి కణాలకు గ్లూకోజ్‌ను సరిగ్గా అందించలేకపోతుంది. దీని కారణంగా, శరీరానికి సరైన శక్తి లభించదు. దీని వల్ల మెదడు పదే పదే ఆకలిని సూచిస్తుంది. వైద్య పరిభాషలో దీనిని పాలీఫాగియా అంటారు. శరీరంలో డయాబెటిస్ మొదలయ్యే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది వీటిని సాధారణమైనదిగా విస్మరిస్తారు. కానీ ఇలా చేయడం మంచిది కాదు. ప్రారంభ దశలోనే ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఇటువంటి వ్యాధులను నివారించవచ్చు. లేకపోతే డయాబెటిస్ మీ జీవితాన్ని నాశనం చేస్తుంది. దీనికి చికిత్స లేనందున దానిని నియంత్రణలో ఉంచడం చాలా అవసరం.

# మేము ఐస్ అండ్ ఫైర్ కాదు.. ఫైర్ అండ్ ఫైర్: అభిషేక్‌తో పాట్నర్‌షిప్‌పై సంజూ శాంసన్



టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో ఓపెనింగ్ జోడి అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ బ్యాంటింగ్ పర్ఫామెన్స్ మళ్లీ వరల్డ్ కప్ వరకు గుర్తుండిపోతుంది. బౌండరీల సునామీ సృష్టించారు ఇద్దరు. ఇదేం చితక్కొట్టుడు సామీ.. అనుకున్నారు ఫ్యాన్స్. అయితే ఆ మ్యాచ్ లో ఇద్దరి పాట్నర్ షిప్ గురించి సంజూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. మాది ఐస్ అండ్ ఫైర్ పాట్నర్షిప్ కాదు.. ఫైర్ అండ్ ఫైర్ అంటూ చమత్కరించాడు.

ఇండియా టుడే 2026 కాంక్లేవ్ లో పాల్గొన్న సంజూ.. ఫైనల్ మ్యాచ్ లో అభిషేక్ తో కెమిస్ట్రీ గురించి చెప్పాడు. మేము ఐస్ అండ్ ఫైర్ కాదు.. ఫైర్ అండ్ ఫైర్.. ఒక్కో సారి అతడు ఫైర్ అయితే మరోసారి నేను ఫైర్ అవుతుంటా. అలాంటి కాంబినేషన్ అది. మేము 2024 నుంచి ఈ ఫార్ములా పాటిస్తూనే ఉన్నాం. దీనికి తోడు కేరళ-పంజాబ్ ఫ్రెండ్షిప్ కొనసాగుతూనే ఉంది. కాంప్లికేట్ చేయదలచుకోలేదు అని చెప్పాడు.

ఫైనల్ లో ఇద్దరూ కలిసి 98 రన్స్ ల ఓపెనింగ్ పాట్నర్షిప్ ఇచ్చారు. పవర్ ప్లేలో అద్భుతమైన స్టార్ట్ రావడంతో స్కోర్ 255 వరకు వెళ్లింది. బాల్ ఎలా వస్తుంది అని అభిషేక్ అడుగుతాడు.. నార్మల్ గా వస్తుంది.. సిక్స్ కొట్టమని చెప్తుంటా. అభిషేక్ చాలా డేరింగ్ బ్యాట్స్ మన్. అతని క్యారెక్టర్ అంటే ఇష్టపడతా. ఫీల్డ్ లో కానీ, బయట కానీ అతని పాట్నర్షిప్ ఇష్టపడుతాను అని సంజూ పేర్కొన్నాడు.

**కంబాక్ స్టోరీ:**

శాంసన్, అభిషేక్ ఇద్దరిదీ టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుతమైన కంబాక్ స్టోరీనే. టౌర్నమెంట్ కు ముందు శాంసన్ ను తప్పించారు. ప్లేయింగ్ 11 లో లేకుండా బెంచ్ కే పరిమితమయ్యే పరిస్థితి. మరోవైపు అభిషేక్ అనారోగ్యం కారణంగా కొన్ని మ్యాచులకు దూరంగా ఉన్నాడు.

చివరి నాలుగు మ్యాచులలో శాంసన్ కు అవకాశం వస్తే.. అద్భుతమైన ఇన్నింగ్స్ తో ఇండియాకు కప్ తెచ్చిపెట్టాడు. ఇక అభిషేక్ మొదటి నుంచీ ఫ్లాప్ అవుతూ విమర్శలపాలయ్యాడు. ఫైనల్ మ్యాచ్ లో ఇంక్రెడిబుల్ ఇన్నింగ్స్ ఆడి విమర్శలకు సమాధానం చెప్పాడు.

## చెన్నై ఫ్యాన్స్‌కు పండగే.. ఐపీఎల్‌కు ముందు స్పెషల్ ఫ్యాన్ ఈవెంట్ రోర్-2026



ఐపీఎల్ లో అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న టీమ్ లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. ఐపీఎల్ వస్తుందంటే ఫ్యాన్స్ లో పూనకాలు వచ్చినట్లే ఉంటుంది. ముఖ్యంగా ధోనీ కోసం స్టేడియానికి పరుగులు తీస్తుంటారు అభిమానులు. 2025 లో నిరాశ పరిచిన చెన్నై.. 2026 లో ఫ్యాన్స్ కు స్పెషల్ ట్రీట్ తో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది.

ఐపీఎల్ కు ముందే ఫ్యాన్స్ కు ట్రీట్ ఇచ్చేందుకు చెన్నై సూపర్ కింగ్స్ రెడీ అయింది. చెన్నై లో మెగా ఫ్యాన్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. చెన్నై చిదంబరం స్టేడియంలో మార్చి 22 న రోర్-2026 పేరున పెద్ద ఈవెంట్ కండక్ట్ చేస్తోంది. సీఎస్కే క్లబ్, దాని సపోర్టర్స్ జర్నీని సెలబ్రేట్ చేస్తున్నట్లు ప్రకటించింది. చెన్నై సీనియర్ ప్లేయర్స్ అయిన సురేష్ రైనా, మాథ్యూ హెడెన్, మురళీ విజయ్, బద్రినాథ్ మొదలైన సీనియర్స్ రీయూనియన్ అవుతున్నట్లు పేర్కొంది. హస్సీ నుంచి హెడెన్, రైనా నుంచి ధోనీ వరకు స్టార్స్ ప్లేయర్స్ ను చూడవచ్చునని పేర్కొంది. ఎగ్జిబిషన్ మ్యాచ్ లో భాగంగా వీళ్లందరూ స్కాడ్ లో ఉంటారని ప్రకటించింది. దీనిక అదనంగా ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహమాన్ లైవ్ పర్ఫామెన్స్ కూడా ఉంటుందని అనౌన్స్ చేసింది.

మార్చి 15 ఉదయం 11 గంటలకు నుంచి జూఖ యాప్ లో టికెట్స్ అందుబాటులో ఉంటాయి. అదే విధంగా ఫ్రాంఛైజీ అఫీషియల్ వెబ్ సైట్, డిస్ట్రిక్ట్ యాప్, వెబ్ సైట్ లో టికెట్స్ బుక్ చేసుకోవచ్చునని పేర్కొంది. కేవలం అఫీషియల్ ప్లాట్ ఫామ్స్ లో మాత్రమే టికెట్లు కొనాలని ఫ్యాన్స్ కు విజ్ఞప్తి చేసింది. RCB అన్‌బాక్సింగ్ ఈవెంట్ లాగానే, CSK రోర్' 26 కూడా ఫ్యాన్స్ తమ అభిమాన ఆటగాళ్లను కలిసి చూడటానికి, ఎంజాయ్ చేయటానికి ఏర్పాటు చేస్తున్న ప్రోగ్రాం. ప్రస్తుత ఆటగాళ్లందరూ కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొంటారు. అంతేకాకుండా, AR రెహమాన్ అదే రోజు స్టేడియంలో లైవ్ పర్ఫామెన్స్ ఇస్తాడు. ఫ్యాన్స్ కు మార్చి 22 బెస్ట్ మెమరబుల్ డే లాగా ఉంటుందని చెబుతున్నారు.




# నిజంగా హీరోయిన్ సాయి పల్లవి రేర్ పీస్!



భానుమతి ఒక్కటే పీస్.. రెండు కులాలు..రెండు మతాలు హైబ్రీడ్ పిల్ల-. అని -ఫిదా- మూవీలో చెప్పినట్టు సాయి పల్లవి నిజంగానే రేర్ పీస్..ఐ మీన్ రేర్ యాక్టర్ అని. ఆమె ఎంచుకుంటున్న కథలు, చేస్తున్న క్రేజీ ప్రాజెక్టులు ఇందుకు అద్దంపడుతున్నాయి. మలయాళ మూవీ -ప్రేమమ్-లో మలర్‌గా కనిపించి తన మాయలో పడేసింది. తెలుగులో -ఫిదా-తో ఎంట్రీ ఇచ్చేసి టాలీవుడ్ ప్రేక్షకుల్ని తనకు ఫిదా అయ్యేలా చేయడమే కాకుండా ఇండస్ట్రీలోని క్రేజీ స్టార్స్, డైరెక్టర్స్ తన నటనకు, డ్యాన్స్‌కు ముగ్ధులయ్యేలా చేసి వరుస క్రేజీ ఆఫర్లని సొంతం చేసుకుంటూ కెరీర్‌లో రాకెట్‌లా దూసుకుపోతోంది. ఎక్కడ నెగ్గాలో కాదు ఎక్కడ తగ్గాలో కూడా తెలుసు అన్నట్టుగా ఎంత పెద్ద ఆఫర్ తనని వెతుక్కుంటూ వచ్చినా.. చిరంజీవి లాంటి స్టార్ ఆఫర్ ఇచ్చినా తనకు తగ్గ క్యారెక్టర్ కాకపోతే నిర్మొహమాటంగా తిరస్కరిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోంది. కెరీర్ ప్రారంభం నుంచి గ్లామర్ క్యారెక్టర్‌కు దూరంగా ఉంటూ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ క్యారెక్టర్లుకు మాత్రమే ప్రధాన్యత ఇస్తూ వస్తోంది. నటిగా ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకుంటోంది. తమిళ సినిమాల్లో హీరోయిన్ ఫ్రెండ్, కాలేజీ స్టూడెంట్ వంటి చిన్న చిన్న క్యారెక్టర్‌తో కెరీర్ ప్రారంభించిన సాయి పల్లివి ఇప్పుడు కెరీర్ బెస్ట్ ఫేజ్‌ని ఎంజాయ్ చేస్తోంది. అలాంటి ఫేజ్ హీరోయిన్‌లకు చాలా రేర్‌గా వస్తుంటుంది. అలాంటి రేర్ అండ్ నెవర్ బిఫోర్ ఫేజ్‌ని ఎంజాయ్ చేస్తోంది. 2024, 2025 రెండేళ్లు రెండు బ్లాక్ బస్టర్లు తండేల్, అమరన్ మూవీస్‌ని తన ఖాతాలో వేసుకున్న సాయి పల్లవి ప్రస్తుతం హిందీలో రెండు, తమిళంలో రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ క్రేజీ లైనప్‌తో అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న -రామాయణ-లో సీతగా నటిస్తున్న విషయం తెలిసిందే. -దంగల్- ఫేమ్ నితేష్ తివారీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని రెండు భాగాలుగా రిలీజ్ చేయబోతున్నారు. రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్న ఈ భారీ ప్రతిష్టాత్మక చిత్రం మొదటి భాగం షూటింగ్ పూర్తి చేసుకుని ఈ ఏడాది దీపావళికి భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. రెండవ భాగాన్ని 2017 దీపావళి సందర్భంగా థియేటర్లలోకి తీసుకురానున్నారు. దీనితో పాటు థాయ్ రీమేక్ -వన్ డే- మూవీ ఆధారంగా ఆమీర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్న -ఏక్ దిన్-లోనూ నటిస్తోంది. ఇక తమిళంలో రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇందులో ధనుష్ హీరోగా -అమరన్- ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి డైరెక్ట్ చేస్తున్న హైఓల్టేజ్ యాక్షన్ డ్రామాలో నటిస్తోంది.

ఇదీ కాకుండా లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం డైరెక్షన్‌లో విలక్షణ హీరో విజయ్ సేతుపతి కథానాయకుడిగా రూపొందనున్న రొమాంటిక్ డ్రామాకు కూడా సాయి పల్లవి ఓకే చెప్పేసింది. దీన్ని లైకా ప్రొడక్షన్ వారు అత్యంత భారీ స్థాయిలో నిర్మించడానిక సన్నాహాలు చేస్తున్నారు. ఇలా ఒకేసారి -రామాయణ-తో పాటు లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం మూవీ వరకు వరుసగా క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ ఎంత మంది స్టార్ హీరోయిన్స్ ఉన్నా హీరోలు, డైరెక్టర్స్ కోరుకుంటున్న ఏకైక హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంటూ రేర్ పీస్ అనిపించుకుంటోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com